నీవు, సమస్త మానవులకు మధ్యవర్తివి నీవు, సిల్వమీద మరణముపొంది తిరిగి సజీవుడవయి మోక్షనగరియందు నిరంతరము జీవించుచున్నావు । యేసునాయకా ॥

84. ఎచ్చట పాతకంబు కడు హెచ్చెనొ భూరి భవ
ద్దయారసం, బచ్చట నెక్కువయ్యెనని యర్మిలి బల్కెడి దివ్య
వాక్యమున్, మచ్చుగనయ్యె నా యెడల మత్కలుషంబులనేక
మైననీ, విచ్చట జూపినావు దయ లెక్కువ నాయెడ యేసు
నాయకా.

తాత్పర్యము

పాప మెక్కడ విస్తరించెనో విస్తారమగు నీ కృప మరి విస్తరించెనని చెప్పు నీ దివ్యమయిన మాట నా యెడల దృష్టాంతమయినది; ఎట్లనగా నా పాపములు విస్తారమైయున్నను, నా మీద నీవు చూపిన కృప అంతకంటె అధికముగా నున్నది । యేసునాయకా ॥

85. ఎవ్వడుగాని నా సరస కింపుగ వచ్చినవాని నెవ్వి
ధిం, దవ్వున బారదోలనని తాల్మిని బల్కెడు నీదు వాక్యముం,
బువ్వవలెన్ మదంతర బుభుక్షయు తాత్మకు తృప్తి జేసి నా,
కొవ్విన పాపముల్ దునిమి కూర్చె సుఖోన్నతి యేసునాయకా.

తాత్పర్యము

ఎవ్వడైన సరే నా యొద్దికి తిన్నగా వచ్చినయెడల వాని నెంతమాత్రమును తోసివేయనని శాంతముతో నీవు పలికిన మాట నాలోని ఆకలిగొనియున్న ఆత్మ కాహారముగానుండి నన్ను తృప్తిపరచి బలిసియున్న నా పాపములను నశింపజేసి సౌఖ్యస్థితి నాకు కలుగజేసెను । యేసునాయకా ॥

86. అంధులు జూడగల్గిరి మహా బధిరుల్విని రుగ్రభూ
తసం, బంధులు బంధముల్వదలి బాగయి రెల్లెడ సర్వరోగని,
ర్బంధులు స్వస్థులైరి మృతి బొల్పడువారు సజీవులైరి పా,
పేంధనవహ్ని నీ వచన మెంత మహత్త్వము యేసునాయకా.

### తాత్పర్యము

గ్రుడ్డివారు చూపునొందిరి, ఎంతెంత చెవిటివారు వినగల్గిరి; ఘోర పిశాచములచే పీడింపబడినవారు విడుదలయైరి; అన్నివిధములైన రోగములు గలవారు బాగయిరి, చనిపోయినవారు సజీవులైరి; పాపమను కట్టెలకు నీ వాక్యము అగ్నివంటిది, దాని మాహాత్మ్యము నేమని వర్ణింతును । యేసునాయకా ॥

## సత్క్రియలవలన నే మోక్షము గలుగదు

87. దురితము బాసి యానరక దుఃఖము దీరునటంచు
కొందరీ, ధరణి ననేక సత్క్రియలు దారొనరింతురు నీ కటాక్ష
మ్ముం, దొరలని సర్వ ధర్మములు దుఃఖకరంబులు గాని సత్సుఖా,
కరములు గావు సత్క్రియల గల్గునె మోక్షము యేసునాయకా.

### తాత్పర్యము

పాపము పోయి నరక శ్రమలు తప్పునని కొందరు భూలోకములో చాలా పుణ్యకార్యములు చేతురు; కాని నీ కృప పొందకుండా మనుష్యులు చేయు కార్యములు దుఃఖకారణములేగాని నిజమయిన సుఖము నిచ్చునవి కావు; పుణ్యకార్యములు చేయుటచేత మోక్షము దొరకదు । యేసునాయకా ॥

88. నిరుపమ నిత్య సత్య ఘన నిర్మలతేజ విరాజమాన
మై, బరగెడు మోక్షపట్టణ శుభస్థిరసౌఖ్యము గల్గు నిన్ను నే,
మరక భజించువారి కది మాని సుకర్మము లెన్నియున్న నీ,
కరుణయులేక సత్క్రియల గల్గునె సద్గతి యేసునాయకా.

### తాత్పర్యము

సమాన రహితమైనది, నిత్యమైనది, సత్యమైనది, నిర్మలమయినదినగు ప్రకాశతచేత వెలుగొందు మోక్షపురిలోనుండు మంగళ ప్రదమును నిరంతరము నైన క్షేమస్థితియందున్న నిన్ను సదా సేవించువారము, ఆ సేవ విడిచిపెట్టి యెన్ని పుణ్యకార్యములు చేసిననేమి, నీ కృప లేనప్పు డెన్ని సత్క్రియ లున్నను సద్గతి కలుగదు । యేసునాయకా ॥

## అన్యదేవతలయెడల భక్తుని విరక్తి

89. వలుకులు వేయునేల తవ పాదసరోజ మరంద
పానమ, ద్విలసిత మానసాళి యవివేక నరావళి గొల్చు వెజ్జు
వే, ల్పుల కడ కేఁగదయ్య ఘన పుష్పకణంబులు గ్రోలు చాత
కం, బెలమిని చౌట గోతికడ కేఁగని రీతిని యేసునాయకా.

### తాత్పర్యము

వేయి మాటలతో ఏమి ప్రయోజనము! నీ పాద పద్మములలోని తేనెను పానముచేసిన నా మనస్సు నే తేనెటీగ జ్ఞానములేని మానవులు సేవించు వ్యర్థమైన దేవతలయొద్దకు బోనేరదు స్వామీ; ఎట్లనగా చంద్రుని కిరణములు పానముచేయు చకోరపక్షి చౌటిగుంటలోకి పోనేరదుగదా! । యేసునాయకా ॥

90. కులము దొలంగుగాక బలు గొప్పతనంబులు
గూలుగాక క, ల్ములు వెసబోవుగాక మరి భోరున మృత్యువు
వచ్చుగాక నీ, విలసిత నిత్యశోభన పవిత్ర సుధారస నామ
సద్రుచుల్, దలపున గొన్నవారితర దైవము గొల్తురె యేసు
నాయకా.

### తాత్పర్యము

కులము పోవచ్చును, ఎంత గొప్ప స్థితియైన పోవచ్చును; ధనము శీఘ్రములో హరించిపోవచ్చును, క్షణమాత్రములో దుర్మరణము సంభవించవచ్చునుగాని నీ ప్రసిద్ధమైన నామముయొక్క దివ్యమయిన రుచి యనుభవించినవారు నిన్ను విడిచి యితర దేవతలను సేవింతురా । యేసునాయకా ॥

## భక్తుని మహా సుఖము

91. ఈ సచరాచరాది జగ మేలగ జాలు ప్రభుత్వ
మబ్బినన్, రాసుల సంఖ్యలై కనక రత్నములుండిన నీ పదాం
బుజా, భ్యాస విశుద్ధభక్తి పరమార్థ సుధారస పాన మానసో,
ల్లాసముతోడ నీడవునె లక్ష్యము సేయగ యేసునాయకా.

### తాత్పర్యము

ఈ సృష్టిలోనున్న ప్రాణులన్నిటిని ఏలునంత అధికారము లభించినను, బంగారము రత్నములు లెక్కింపలేని గుట్టలుగా సంపాదించినను, నీ పాదపద్మమందు శుద్ధ భక్తి అభ్యసించుటవల్లను, పరమార్థమనే అమృతమును పానముచేయుటవల్లను కలుగు మనసానందముతో సమానమైన ధన్యత కలుగునా! । యేసునాయకా ॥

92. శమదమ సంపదల్ గలుగు చంచల భావ మణంగు
చిత్తమున్, సమత వహించు మోక్ష సువిచారము సారము
గాంచు ప్రేమశాం, తము దయ తాల్మి నమ్రతయు ధైర్యము
వర్ధిలు నీ పదాబ్జదా, స్యము సమకూడెనేని నరజన్మఫలంబిదె
యేసునాయకా.

### తాత్పర్యము

నీ పాదపద్మమును సేవించు భాగ్యము లభించినయెడల మానవునికి శమదమాది ఐశ్వర్యములు లభించును, మనస్సుకు చాంచల్యము నశించును, బుద్ధికి సుఖదుఃఖాదులయందు సమభావము అబ్బును, మోక్ష విషయమైన మంచి ఆలోచన ననుభవించును, ప్రేమ, శాంతము, దయ, సహనము, వినయము, ధైర్యము వృద్ధియగును; ఇదేగదా మానవజన్మ మెత్తినందుకు ఫలము! । యేసునాయకా ॥

93. పాపము చెడ్డదో యనుచు బల్కుదు రింతియ
కాని దాని సం, తాపము హాని దుర్గతి విధంబు లెదం దల
పోసి వీడగా, నోపరు సత్యక్రైస్తవ జనోత్తము డాత్మ వివేక
దీపికా, వ్యాపకుడై యఘాళి గని వాటి దొలంగును యేసు
నాయకా.

### తాత్పర్యము

పాపము చెడ్డదియని కొందరందురేగాని దానివల్ల కలుగు దుఃఖము, హాని, చివరకు వచ్చు దుర్గతినిగురించి మనస్సులో ఆలోచించి పాపము

చేయుట మానరు; నిజమైన క్రైస్తవుడైతే జ్ఞానదీపము హృదయములో వెలుగుటచేత తన పాపసమూహమును చూచి వాటిని విడిచిపెట్టును । యేసునాయకా ॥

94. కుజనులజేయు సజ్జనుల కూళుల జేయును కోమ
లంబుగా, వృజినుల జేయు పుణ్యులుగ క్రుద్ధులజేయును శుద్ధ
సాధుగా, నిజమిది నీసుధా మధుర నిర్మలనామ మహత్వ మిట్టి నీ,
భజన మొనర్చి నాకలుష బంధము లూడ్తును యేసునాయకా.

తాత్పర్యము

నీ నామభజన దుష్టులను మంచివారినిగాను, మోటువాండ్లను మృదువైనవారినిగాను, పాపులను పుణ్యులుగాను, కోపదారులను బహు సాధువులుగాను చేయునన్నమాట సత్యమే, అమృతమువలె మధురమైన నీ పవిత్ర నామమింత మహిమగలది; కాబట్టి నీ నామమును భజించి నా పాప బంధములను తెగగొట్టుకొందును । యేసునాయకా ॥

95. శంక యొకింతలేని మతి సజ్జన క్రైస్తవగోష్ఠి నిత్య
మున్, బొంకులులేని వాక్సరణి పొందగు నీ పద భక్తి చింత
యే, కింకరులందు వర్ధిలునో కేవలభాగ్యము వారిదే కదా
యంకలిలేని యాత్మ పరమార్థ సుఖంబది యేసునాయకా.

తాత్పర్యము

అనుమాన మేమాత్రము లేని మనస్సు, తీయకుండా సత్క్రైస్తవులతో సహవాసము, అసత్యమెన్నడు ఆడని వాక్కు దివ్యమయిన నీ పాద భక్తిమీదనె ధ్యానము, నీ దాసులలో ఎవరియందు అభివృద్ధి పొందుచుండునో వారే కదా నిజమైన ధన్యులు, నిస్సందేహముగా ఆత్మీయ పరమార్థమంటే యిదే। యేసునాయకా ॥

96. సకల పురాణ శాస్త్రముల సారవిచారము సేయు
పండితుల్, ప్రకటిత కావ్య నాటక సుభాషిత నైపుణులైన

సత్కవుల్, వికట శరీర తత్త్వ పరివేత్తలు నీదగు శిష్యకోటిలో
నొకనికి సాటివత్తురె మనోన్నత భక్తిని యేసునాయకా.

### తాత్పర్యము

సకలమైన పురాణములయొక్క శాస్త్రములయొక్క సారమును గ్రహించిన పండితులును, ప్రసిద్ధమగు కార్యములు నాటకములు చక్కగా చెప్పుట యందు నేర్పరులైన కవీశ్వరులును, విచిత్రమయిన శరీర జ్ఞానమునందు ప్రసిద్ధి చెందినవారును, మానసికమయిన భక్తి విషయములో నీ శిష్యులలో నొకనితో సాటియగుదురా! కారు । యేసునాయకా ॥

97. సిలువ దెసన్వసించు తమ శిష్యుని నెమ్మదితోటి
సాటియే, కుల బల శాలియై నిఖిల కుంభిని నేలిన రాజుకైన
సాం, పుల కళలీను సంపదల బొల్చు ధనాఢ్యుకైన కోటి వం,
తుల తుదివంతు గల్గునె మనో సుఖమెన్నడు యేసునాయకా.

### తాత్పర్యము

గొప్ప వంశమునందు పుట్టి యెంత బలముగలవాడయి యావత్తు లోకము నేలిన రాజయినను, మహా వైభవముతోను సంపత్తుతోను తుల తూగువాడయినను, సిలువవైపు చూచుచు జీవించు నీ శిష్యులలో నొకడనుభవించు మనోనెమ్మదితో సమానమయిన నెమ్మది యతని కుండగలదా? అసలుదానిలో కోటియవ పాలయిన నుండగలదా! । యేసునాయకా ॥

98. కలిగెగదా మదాత్మకృత కల్మష ధౌత పవిత్ర
రక్తమున్, గలిగెగదా భవత్కరుణ కారణ జీవనమంతరాత్మ
లో, గలిగెగదాత్వదంఘ్రియుగ కౌశల భక్తికి శక్తి యుక్తులున్,
గలిగెగదా సదా మది సుఖంబఖిలంబును యేసునాయకా.

### తాత్పర్యము

నా యాత్మ చేసిన పాపమును కడిగివేయ పవిత్రరక్తము నాకు దొరికినది, నాలోని యాత్మకు నీ కృపవల్ల కలిగే జీవనము లభించినది, నీ పాద ద్వయమునందు నిజమైన భక్తియుంచు శక్తియును మనస్సున నాకు ప్రాప్తించి

నది; నా హృదయమునకు సకల విధములయిన ఆనందము కలిగినది । యేసునాయకా ॥

99. అరమరలేని నా మన మహర్నిశలున్ భవదంఘ్రు
లొద్దికిన్, బిరబిర బోవగా దొణగె పేరిమి తాల్మివహించి భక్తి
పై, బొరిబొరి వేడుకల్ నిగుడె బుద్ధికి నిల్కడలబ్బె నమ్మికల్
మరిమరి గల్గె నాత్మకు శుభంబొనగూడెను యేసునాయకా.

### తాత్పర్యము

ఏ యభ్యంతరములేక నా మనస్సు రేయింబగలు నీ పాదములచెంత వేగముగా బోవ నేర్చుకొనియున్నది, ప్రేమ శాంతము సంపాదించుకొని నీ యందు భక్తికలిగి యుండవలెనన్న ఆశ మెండయినది, మనోచాంచల్యము పోయి స్థిరబుద్ధి దొరికినది, విశ్వాసము వృద్ధియగుచున్నది; నా యాత్మ ధన్యమైన స్థితిలో ప్రవేశించియున్నది । యేసునాయకా ॥

### ప్రభునామ విజయము

100. అవనియు నాకసంబును మహాజలరాశియు పర్వతం
బులున్, రవియును చంద్రతార నికరంబులు సర్వము నాశమైన
నీ, ప్రవిమల నామమెప్పుడు దిరంబుగ నిల్చును దివ్యమోక్షు
వై, భవ సుఖ రాజ్యమేలుచు శుభంబుల దేలుచు యేసు
నాయకా.

### తాత్పర్యము

భూమియును ఆకాశమును మహాసముద్రమును పర్వతములును సూర్య చంద్ర నక్షత్ర సమూహములును సమస్తము శూన్యమైపోయినను నీ నామము సదాకాలము స్థిరముగా నిలుచును; నీవు దివ్యమయిన పరలోకమహిమను సుఖమును రాజ్యమును నిరంతరమేలుచు సకల శుభముల ననుభవించుచు నుందువు । యేసునాయకా ॥

క॥ తనకలుష మెరిగి యేసుని
ఘనపదముల శరణుజొచ్చి కడుప్రీతిని యే

మనుజుం డీ శతకము జది
వినవాని కొసంగు దేవు డిహపరసుఖముల్.

తాత్పర్యము

తన పాపమును గ్రహించి యేసురక్షకుని పాదములను శరణము చేసికొని విస్తారమైన ప్రేమతో ఈ శతకమును ఎవడు చదువునో అతనికి ఇహపర సుఖములు దేవుడు దయచేయును.

ఆ॥ పదియు నెనిమిది నూర్లు నల్పదియు నైదు
హాయనములు జూలయి మాసమందు భువిని
యేసునాయక శతకంబు నిది ప్రణీత
మయ్యె చౌదరి పురుషోత్తమాఖ్యు వలన.

తాత్పర్యము

ఆన 1845 సం॥ జూలైనెలలో చౌదరి పురుషోత్తము ఈ యేసునాయక శతకమును రచియించెను.

# యేసు క్రీస్తు ప్రభు శతకము

# JESUS CHRIST THE ONE MEDIATOR

# విషయసూచిక


| | పద్యముల సంఖ్య |
|---|---|
| స్తోత్ర ప్రార్థనలు ... ... ... ... | 107 |
| దేవుని వాక్యము ... ... ... ... | 108 |
| పాపము ఒప్పుకొని మన్నింపు అడుగుట ... ... | 110 |
| దేవుని ప్రార్థించుట ... ... ... ... | 115 |
| పరిశుద్ధాత్మను బ్రతిమాలుకొనుట ... ... ... | 117 |
| ప్రార్థన స్తోత్రములు ... ... ... ... | 120 |
| ప్రభువుయొక్క శ్రమలు తలంచుట ... ... | 130 |
| అన్యజనులను పిలుచుట ... ... ... | 134 |
| అన్యదైవములు వట్టివి ... ... ... ... | 136 |
| మనోవేగమును గురించి... ... ... ... | 138 |
| భక్తులు ఎటువంటివారు... ... ... ... | 139 |
| మనుష్యులకు భయపడకుండుట ... ... ... | 141 |
| నిత్యానిత్యవస్తు వివేకము ... ... ... | 142 |
| అంత్యదినమును గురించి... ... ... ... | 145 |
| ప్రభునామ విజయము... ... ... ... | 146 |

# యేసు క్రీస్తు ప్రభు శతకము

## స్తోత్రప్రార్థనలు

శా॥ 1. శ్రీ రాజిల్లు భవత్పదాబ్జములు నా చిత్తంబులో నిల్పి
నీ, కారుణ్యామృత బిందు బృందములు వేడ్కల్ మీరగా
జిల్కి, దు ర్వార స్వాంత దురంతతాపమును దీరన్ శాంతి
బొందించి యీ, వే రక్షణ్యము నా నుతుల్ వినగరావే యేసు
క్రీస్తు ప్రభో.

### తాత్పర్యము

మంగళ ప్రదములగు నీ పాదపద్మములను నా మనస్సునందు నిలిపి యుంచి నీ కృపా బిందువుల ధారలను నా మనస్సుతీర కురిపించి, అణప సాధ్యముకాని మనోదుఃఖమును పోగొట్టి శాంతియిచ్చి నన్ను రక్షించుము, నేను చేయు స్తుతుల నంగీకరించుటకు రమ్ము । యేసుక్రీస్తు ॥

శా॥ 2. పాండిత్యం బెరుగంగనేరని మహా పాపాత్మునజ్ఞాను
పా, షండున్ నన్ను వివేకమిచ్చి దయతో స్వాంతంబు కన్విప్పి నీ,
యండంజేరిచి నేర్పువాక్కులు మనోహస్తంబులంగుచ్చి పూ,
దండల్ గానిదె పూజసేతు తవ పాదం యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

నేను పాండిత్యము లేనివాడను, మహాపాపిని, అజ్ఞానిని, భక్తిహీనుడను, నామీద దయయుంచి జ్ఞానమునిచ్చి నా మనోనేత్రము తెరచి నీ యండను నన్ను చేర్చుకొని నాకు నీవు మాటలు నేర్పితివా, నా మనస్సు అనే చేతులతో స్తోత్రగీతములనే పూవులదండలుగుచ్చి నీ పాదపూజచేయుదును । యేసుక్రీస్తు ॥

3. అరుణాబ్జాంతరమైన తేనియల పానాసక్తిచే చొక్క-
సుం, దర మత్తాళి విధంబునన్ గళిత రక్తస్తంభ శుంభద్భవ,
చ్చరణాబ్జంబులలోని గాయముల పొంతంబోయి నా చిత్తమున్,
పరమానంద రసంబు గ్రోలుగద దేవా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

ఎఱ్ఱ తామర పువ్వులలోని తేనెను త్రాగుటవల్ల మదించిన చక్కని తుమ్మెదలవలె నా మనస్సు కారుచున్న రక్తముతో తడిసిన సిలువ నలంకరించుచున్న నీ పాదపద్మములలో నున్న గాయములయొద్దకి బోయి పరమానందము ననుభవించునుగదా । యేసుక్రీస్తు ॥

4. నది యంభోనిధి బాయలేని గతి నీ నామామృతం
బాను నా, యెదనీ పాద పయోజముల్ దినము సేవింపఁ
వడిన్ ఈడ్చుమో, సదయాంతః కరణా యఘాపహరణా
సత్క్రైస్తవోద్ధారణా, మదికిన్నెమ్మది నిచ్చినన్ మనుపరమ్మా
యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

నదులు సముద్రమును విడిచిపోలేక దానినే అంటి యుండువిధముగా నీ నామముయొక్క మాధుర్యము ననుభవించుచున్న నా మనస్సు నీ పాదపద్మములను వదలక అనుదినము సేవించునట్లు దానిని ప్రేరేపించుము దయతో నిండియున్న మనస్సుగల దేవా, పాపములను హరించువాడా, నిజమైన క్రైస్తవులను ఉద్ధరించువాడా, నా మనస్సుకు శాంతి యిచ్చి నన్ను రక్షించుటకు రమ్ము । యేసుక్రీస్తు ॥

దేవుని వాక్యము

5. దురితారణ్య దవాగ్నియై సుజనచేతోమోద బోధ
స్ఫుర, ద్వరదీపాంకురమై పిశాచ మద గర్వధ్వాంత మార్తాండ
చం, డ రుచి ప్రస్ఫుటమై వెలుంగు తవ దార్ఢ్యంబైన వాక్యంబు

నా, యరి బృందంబు దోలంగగా నొసగుమయ్యా యేసు
క్రీస్తుప్రభో.

## తాత్పర్యము

నీ స్థిరమయిన వాక్యము పాపమనే అడవిని దహించు కారుచిచ్చయి యున్నది; సజ్జనుల మనస్సుకు ఆనందమునిచ్చు బోధ యను దీపమయి యున్నది; సాతానుయొక్క మదము గర్వము అను చీకటిని పోగొట్టు సూర్యుని తీక్షణమైన కిరణమువలె ప్రకాశించునది; ఇట్టి నీ వాక్యమును నా శత్రు సమూహమును పారదోలుటకు నా కనుగ్రహించుము । యేసుక్రీస్తు ॥

6. చేతో దుఃఖము బాపు శాంత మిడు దుశ్చింతాల
తల్ ద్రుంచు ని, ర్భీతి ప్రేమయు ధైర్య మిచ్చు నఘముల్
భేదించు భావార్థముల్, మూతల్విప్పును సంశయాంధ తమ
ముం బోగొట్టు నీ వాక్యముల్, బ్రీతిన్ నమ్మిన వారి కెల్లపుడు
ధాత్రిన్ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

లోకమునందు నీ వాక్యమును ప్రేమతో నమ్మినవానికది మనస్సులోని దుఃఖము పోగొట్టును, నెమ్మది యిచ్చును, దురాలోచనలనే తీగెలను విరిచి వేయును, నిర్భయము ప్రేమ ధైర్యము పుట్టించును; పాపములను చంపి వేయును. వాక్యములయొక్క అర్థమును విప్పి చూపును, అనుమానములనే చీకటిని పారదోలును । యేసుక్రీస్తు ॥

7. వాతో ద్ధూతముచేత దుర్దిన ఘన ప్రచ్ఛన్నముం
బాసి ఖ, ద్యోతుం డంబర వీధి చండతర దీప్తుండౌచు గన్ప
ట్టు నా, రీతి న్నీ కరుణా మహా నిలము ప్రేరేపించి మత్పాప
జీ, మూతంబుం దొలగించి యాత్మ వెలుగిమ్మా యేసుక్రీస్తు
ప్రభో.

## తాత్పర్యము

పెనుగాలి కొట్టినప్పుడు ముసురుపట్టియున్న దినమున పుట్టిన మేఘములు విడిపోయి సూర్యుడు ఆకాశమును తీక్షణమైన కిరణములచేత ప్రకా

శించును. అదేవిధముగా నీ కృపయను పెనుగాలిని కొట్టించి నా పాప మను మేఘమును చెదరగొట్టి నా యాత్మ ప్రకాశించునట్లు చేయుము। యేసుక్రీస్తు॥

### పాపము ఒప్పుకొని మన్నింపు అడుగుట

8. దురితారంభము వేళ తెల్విగొని దోడ్తో తత్స్వభావో
ద్భవాం, కురముల్ నీ శుభవాక్య దాత్రమున వేగోయంగ
లేకున్న బం, ధుర శాఖా లత పత్ర పుష్ప ఫల సందోహాఘ
దుర్వృక్షముం, బెరుగుం దానిని గూల్ప మానసి తరంబే
యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

పాపము చేయ నారంభించునప్పుడు మెలకువపడి వెంటనే ఆ దుష్ట స్వభావముయొక్క చిగుళ్లను నీ వాక్యమను కొడవలితో కోసివేయనియెడల విస్తారమైన కొమ్మలు తీగెలు ఆకులు పువ్వులు ఫలములతో నిండి పాప వృక్షము బలిసిపోవును, దాని పడగొట్టుటకు మనుష్యునికి శక్యము కాదు। యేసుక్రీస్తు॥

9. మాయాజాలములోన జిక్కువడి సన్మార్గంబు వో
గొట్టి సు, శ్రేయాసక్తి పరిత్యజించి నిరత స్వేచ్ఛాను సంచారి
నై, నీ యాధీనముగాని పెక్కుదినముల్ నే బుచ్చితిఁ బాప
మో, దాయత్తైక మనంబు వెంటఁ జనితయ్యా యేసుక్రీస్తు
ప్రభో.

### తాత్పర్యము

మాయల సమూహములో తగులుకొని, సన్మార్గము విడిచిపెట్టి, క్షేమ మార్గమునందలి ఆసక్తి తగ్గిపోయి యెల్లప్పుడు నా యిష్టప్రకారమే నడుచు కొనుచు నీ యిష్టమునకు విరోధముగా అనేకదినములు గడిపితిని, పాపపు సంతోషమునకు లోనైన నా మనస్సు నడిపించినట్లు నడుచుకొంటినయ్యా। యేసుక్రీస్తు॥

శా॥ 10. వారింపం దరిలేని యింద్రియ గుణ వ్యాపారమా నేరులం, బూరింపం బడరాని తృష్ణయను సంభోరాసిలోఁ జొచ్చి చే, బారల్వేయుచు నీఁది యీఁది తుద లాభం బొక్క గవ్వైన కం, ళ్లారం గంటి నె గాలి మూట గడితయ్యా యేసు క్రీస్తుప్రభో.

### తాత్పర్యము

ఆపుటకు వీలుకాని స్వాభావిక దుర్గుణ వ్యాపారములనే నదులలోను, తీర్చుకొన సాధ్యముకాని దాహమనే (=ఆశ) సముద్రములోను పడి యీఁది యీఁది కష్టపడితేనే గాని ఒక గవ్వయిన లాభము నా కంట చూడలేదు; గాలిమూట కట్టినట్టాయెనే నా బ్రతుకు । యేసుక్రీస్తుప్రభువా ॥

శా॥ 11. పాపాత్ముల్ భువి లేరె నా కొలది దుష్పాపుల్ మహీ మండల, ద్వీపాంతంబుల లోపలం గలరె పందెం బొగ్గి యిట్లొ క్కనిం, జూపింపంగలవారు లేరిల మహాచోద్యంబు నీ వస్మదీ, యావత్పాప భరంపు పోదు నిమితయ్యా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

లోకములో పాపాత్ములెందరో లేరు! కాని నాయంత గొప్ప పాపాత్ములు ఈ భూలోకములోను ద్వీపాంతరములలోను లేనేలేరు; ఉన్నట్టయిన వారిని చూపుదునని పందెమువేసి చూపగలవారు లేరు; అయితే ఇది యెంత అద్భుతము? నీవు నా యావత్తు పాపభారము పోగొట్టి యున్నావు । యేసు క్రీస్తు ॥

మ॥ 12. పదివేల్ నాలుకలైన జాలవిక నా పాపంబులెన్నంగ నీ, మృదుపాదక్షత రక్తపుణ్యమహిమా విస్తారమున్ లెక్కనే య దివిక్ష్మాజల సర్వజీవముల జిహ్వాల్ చాలునేయిట్టి నీ, పదమే యాస్పదమంచు జేరితిని దేవా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

నా పాపములను లెక్కించుటకు వేలకొలది నాలుకలైన చాలవు; మృదువయిన నీ పాదములయందలి గాయములనుండి స్రవించిన రక్తమువల్ల కలుగు పుణ్యప్రభావమును లెక్కించుటకు ఆకాశములోను భూమిమీదను సముద్రములలోను చరించు ప్రాణికోటుల నాలుకలన్ని చాలునా! ఇటువంటి నీ పాదములే నాకు శరణు అని నేను వచ్చియున్నాను। యేసుక్రీస్తు॥

మ॥ **13. అరికాల్‌నుంచి శిరోపరిస్థలము పర్యంతంబు సర్వాంగముం, బరిశోధించిన లోపల్గఁ వెలపల్గఁ పాపంబులేనట్టి చోటు రవంతైనను గానవచ్చునె పటాటోపంబు పేరే సుమీ, నరరూపుం గొనునేనెదుర్నరకి నన్నా యేసుక్రీస్తుప్రభో.**

### తాత్పర్యము

అరికాలు మొదలు తలపై భాగమువరకు శరీరమంతా పరిశోధించినను లోపలగాని బైటగాని పాపములేనిచోటు లేశమాత్రమైన కనబడదుగదా; బయటివేషమే; ఉత్తపేరుమాత్రమే నరరూపముగల నేను నరకపాత్రుడనే। యేసుక్రీస్తు॥

మ॥ **14. పెరుగుం గయ్యము గవ్వగాని పనికై భ్రూయుగ్మముల్ వంకలై, మెరుపౌ గన్నులు కొల్మితిత్తుల గతిఁ వేండ్రంబుగా నాసికాం, తర నిశ్వాసము లొప్ప క్రోధహుత భుక్తప్తాంగమా నిట్టి దు, ర్నరుడఁ నారక భూతరూపమయి తన్నా యేసుక్రీస్తుప్రభో.**

### తాత్పర్యము

గవ్వయైన చెయ్యని అత్యల్పమైన కారణమునకు పోట్లాట తటస్థించును; కనుబొమ్మలు వంకరపోవును; కన్నులు ఎఱ్ఱపడును; ముక్కు రంధ్రములలోనుంచి ఊపిరిగాలి కొలిమిలోనుండి వచ్చు వేడిగాలివలె వేండ్రమగును; విరోధమనే అగ్నిచేత కాలుచుండు శరీరముగల నేను దురాత్ముడను; నరకములో పిశాచముయొక్క స్వరూపము ధరించినవాడనయితిని। యేసుక్రీస్తు॥

శా॥ 15. పాపాత్ముండను పాపకర్ముడను దుర్భాగ్యుండనే మూ
ర్ఖుడు, దుర్వ్యాపారుండను కామక్రోధ మదగర్వ క్రూరచిత్తుండ
నం, తాప స్వాంతుడ నిన్ను జేరితిక నన్ దన్నేసినంబోను నీ,
తో పోరాడెదగాక దిక్కుమరిలేదో యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

నా యాత్మ పాపముతో నిండినది; నా క్రియలు పాపముతో నిండినవి; నేను దౌర్భాగ్యుడను, మూర్ఖుడను, నా చర్య యావత్తు దుష్టమయినది; నా మనస్సు కామము, ద్వేషము, మదము, గర్వము క్రూరత్వముతో నిండినది; పాపముతో నిండిన స్వభావముగలవాడను. అట్టి నేను నీ దాపున చేరితిని; నీవు నన్ను తన్నివేసినను నిన్ను విడిచిపెట్టను; నీకంటె మరి యెవరు నాకు దిక్కు లేరు, నీతో పోరాడెదను। యేసుక్రీస్తు॥

మ॥ 16. ఒకమారా పలుమార్లు నేనెరిగి పాపోగ్రాహిదంష్ట్రాం
కుర, ప్రకటంబైన విషాగ్ని కీలల వెసన్ బానంబుగావించి యా,
త్మను దుర్మృత్యువు వాతబెట్టితని నా తప్పెంతువో, పెంతువో,
యిక నీవే గతిబెట్టు నిన్విడువ జుమ్మా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

ఒకసారికాదు, ఎన్నెన్నిసార్లో బుద్ధిపూర్వకముగా నేను పాపమనే సర్పముయొక్క కోరలయందు నిండియుండు విషమనే మంటలను పానముచేసి నా యాత్మను ఘోరమరణము పాలుచేసితినని నామీద నేరము మోపుదువో, లేక క్షమించి రక్షింతువో, నన్నేమిచేసినను సరే, నిన్ను నేను విడిచేదిలేదు। యేసుక్రీస్తు॥

శా॥ 17. కాల వ్యాళ విషాగ్ని కీల కులటా కంజాక్షివాల్
జూపులం, గ్రోలంబోయెడి చక్షురింద్రియముపై కుంతంబుతో
గ్రుచ్చినన్, మేలౌనో నరులార మీరలటు బల్కెన్ బోకుడీయం
చు న, న్నాలోకింపగ సాక్షిగన్పరతునయ్యా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

నల్ల త్రాచు విషముయొక్క మంటలను బోలిన వ్యభిచారస్త్రీయొక్క మోహ దృష్టులను పానముచేయబోవు కన్నులను ఖడ్గముతో పొడిచినను మంచిదే. ఓ నరులార, ఆ దారిని పోకండని నన్ను చూడవచ్చిన వారిని హెచ్చరించెదనయ్యా । యేసుక్రీస్తు ॥

శా॥ 18. గర్వాంధంబున కన్నుగానక బలాత్కారంబునం జిత్తమా, సర్వజ్ఞుండగు తండ్రి కట్టెదుర నిశ్శంకన్ మహా పాపముల్, సర్వాపేక్షల జేసినావు ఇక నీ సాంగత్య మింతయ్యెనే, నుర్విన్ సజ్జన నిందితుండనయి తయ్యో యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

ఓ నా మనసా, గర్వముచేత కన్నుగానక మొండితనముచేత సర్వము నెరిగిన తండ్రియగు దేవుని సముఖమున భయములేకుండా ఘోరపాపములు బహు ఆశతో చేసితివి; నీ సహవాసమున నా కింతలాభము దొరికినది; లోకములో సజ్జనుల నిందపాలైతినిగదా । యేసుక్రీస్తు ॥

మ॥ 19. పటుదావాగ్ని నికాలియున్న మొరడున్ పంథానమం దుండి చీ, కటివేళం జనువారికిన్ భయదమై గన్పించు చందంబునన్, కటుతిక్తాంతర పాపసర్ప విషదగ్ధ ప్రాణినైయున్న యే, నటులైతిన్ సుజనాళి చూపులకునయ్యా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

గొప్ప కారుచిచ్చుచేత కాలిపోయిన చెట్టు మొద్దుమార్గములో పడియుండి చీకటిలో ఆ దారిని పోవువారికి భయము పుట్టించురీతిగా, మతిభ్రమింపజేయు పాము విషమును బోలిన పాపముచేత నశించినవాడనైన నేను సజ్జనుల దృష్టికి భయంకరుడనయ్యా । యేసుక్రీస్తు ॥

శా 20. నా పాపంబాకుంచమైన తవ పుణ్యం బొప్పు బానంతమై, కూపంబైన తటాకమాను మమ దుష్కృత్యంబు నీ

పుణ్యము, న్వేబారినది బోలు నా దురితమున్నీ పుణ్యమం
భోనిధ్యై, యాపుణ్ ఎంతనవచ్చు నీ సుకృత మాహా యేసు
క్రీస్తుప్రభో.

## తాత్పర్యము

నా పాపము మొక కుంచమంత అయితే, నీ పుణ్యము బానంత విస్తార మయి యున్నది; నా పాపము బావియంతయైతే నీ పుణ్యము చెరువంతయై యున్నది; నా పాపము నదీప్రవాహమంత అయితే నీ పుణ్యము మహాసముద్ర మంతయై నా పాపమును హరించివేయును. ఆహా! నీ పుణ్యమెంత అద్భుత మయిన దనవచ్చును । యేసుక్రీస్తు ॥

శా 21. నా కన్నంగడుపాప కర్ముడొకడైనన్ లేడు భూమండ
లిన్, నీ కన్నం బ్రియరక్షకుం డెచట నన్వేషించినన్ లేడికన్,
నాకున్నీకును జోడుగూడెగద నన్నుంబ్రోవు మిక్లైన ము, ల్లోకం
బుల్ నిను మెచ్చు నీ బిరుదు నిల్చున్ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

భూలోకములో నాకంటె ఎక్కువ పాపాత్ముడు లేనేలేదు; నీకంటె కృపగల రక్షకుడు ఎంత వెదికినను ఎక్కడనులేదు—నాకును నీకును ఇప్పుడు జత కుదిరినది; నన్ను నీవు రక్షించితివా, మూడు లోకములును నిన్ను మెచ్చు కొనును; పాపికి రక్షకుడవనే పేరు నీకు చెల్లును । యేసుక్రీస్తు ॥

## దేవుని ప్రార్థించుట

మ॥ 22. నను బుట్టించిన విశ్వకర్త సకలాంతర్యామి నాద్యంత
శూ, న్యుని సర్వజ్ఞుని నిర్వికారు పరిపూర్ణున్ నిత్యునాకాశ రా,
జ్యనివాసోన్నతు దేవునిం దలచి నా స్వాంతంబునం గొల్తు గ్ర,
న్నన నా దుష్కృతముల్ క్షమించుమని యన్నా యేసుక్రీస్తు
ప్రభో.

## తాత్పర్యము

నీవు నన్ను సృష్టించిన సృష్టికర్తవు; సకల జగత్తులోను వ్యాపించి యున్నవాడవు; ఆద్యంతములు లేనివాడవు; సమస్తము నెరిగినవాడవు; మార్పు లేనివాడవు; పరిపూర్ణుడవు; నిత్యుడవు; మోక్షరాజ్యమునందు నివసించు ఘనుడవు; అట్టి నిన్ను స్మరించుచు నా మనస్సునందు నిన్ను సేవించెదను; వెంటనే నా పాపములను క్షమించుమని వేడుకొందును। యేసుక్రీస్తు॥

మ॥ 23. తరణిం జీకటులివ్వ వేడుగతి శీతం బగ్నిచోగోరు వే,
దురు చందంబున దుష్టవాంఛలను సంతోషింప నాబోటి దు,
ర్నరులుం దేవుని వేడబోదు రెద పూర్ణభ్రాంతులై యాపరా,
త్పరుపై పాపము మోప దుర్గతులురావా యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

చీకటి నిమ్మని సూర్యునివేడుకొను పిచ్చివానివలెను, చల్లదనమిమ్మని అగ్నిని వేడుకొను పిచ్చివానివలెను, చెడుకోరికలను తీర్చుమని నావంటి దుష్టులు వెర్రిభ్రమచేత దేవుని వేడుకొందురు; ఆ దేవునిమీద నిట్లు పాపము నారోపించుటవల్ల దుర్గతి కలుగదా। యేసుక్రీస్తు॥

మ॥ 24. కడుపారం గనుకున్న బిడ్డలెడ నే కాలంబునం దెట్లు,
పా, ల్గుడుపం బోలునో యేది యవసరమొ తల్లుల్ వేడ్కతో
నియ్యనే, తడవున్ చేయరు అట్ల నా యవసరాల్ తత్కాల
మందిచ్చి, నా యిడుమల్బాపెడు తండ్రినిం దలతు ప్రేమన్ యేసు
క్రీస్తుప్రభో.

## తాత్పర్యము

నిండునెలలు మోసి కన్నబిడ్డలకు ఎప్పుడు పాలియ్యవలెనో, యే యక్కర యెప్పుడు తీర్చవలెనో అది తల్లులు ఎరిగి ప్రేమతో ఆ పనులు ఆలస్యము చేయకుండా తీర్చుదురు. అదేవిధముగా నాకు కావలసినవి ఆయా సమయములయందు ఇచ్చి నా కష్టములను పోగొట్టే తండ్రిని ప్రేమతో ధ్యానించుకొందును। యేసుక్రీస్తు॥

మ॥ 25. పుడమీ మృత్తిక కుంచమందు నిడి యంభోరాశి
నీరంబులన్, పుడిసెల్గా నొక జేనలోన గగనంబున్ గొల్చియుం
ద్రాసులో, పడిరాళ్లట్లు మహామహీధరము లొప్పంబెట్టి తూఁ
చంగనె, వ్వడు సామర్థ్యుఁడో వాని గొల్తునెద దేవా యేసు
క్రీస్తుప్రభో.

## తాత్పర్యము

ఈ భూలోకమందున్న మన్నంతయు నొకకుంచముతో కొలువగల వాడును, సముద్రములలోని యుదకమునంతను తన పుడిసెటిలో పట్టగల వాడును, ఆకాశమండలమునంతను తన జేనతో కొలువగలవాడును, బ్రహ్మాండ మయిన పర్వతములను తూనికె రాళ్లుగా త్రాసులోపెట్టి తూచగలవాడు నయిన మహాత్ముని సేవింతును । యేసుక్రీస్తు ॥

మ॥ 26. జగతీమండల మావగింజవలెనే సర్వేశు దృగ్దృష్టిలో,
నగుపించున్ మరి దీనిలోన మమదేహం బెంత యేనెంత నా,
దగుకాలంబది యెంత రేణువణువుం దర్భాగమున్ లేనినే, నొగి
నిన్నెట్లు నుతింతు నెట్లెరుగనేర్తో యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

ఈ జగత్తంతా సర్వేశ్వరుని దృష్టికి ఆవగింజవలె అల్పముగా కన బడును; దీనిలో నా దేహమెంత? నేనెంత? నా జీవితకాలమెంత? అత్యల్ప మయిన నలుసులో ఎన్నవ భాగమగును? అట్టి నేను నిన్నెట్లు స్తుతించగలను? నిన్నెట్లు తెలిసికొనగలను । యేసుక్రీస్తు ॥

## పరిశుద్ధాత్మను బ్రతిమాలుకొనుట

మ॥ 27. పరమార్థం బెరిగించు వాక్యముల తాత్పర్యంబు
బోధించు ని, ష్ఠురచిత్తంబు మృదుత్వమున్నెరపు తాటోశెల్ల
పోగొట్టునా, పరిశుద్ధాత్ముడు నన్ను బాసెనకటా పాపాగ్నికీల
ల్మదిం, బెరసన్నెమ్మది బోయి దుఃఖములు గ్రమ్మెన్ యేసు
క్రీస్తుప్రభో.

## తాత్పర్యము

పరిశుద్ధాత్మ దేవుడు పరమార్థమెట్టిదో తెలియజేయును, వేదవాక్యముల భావమును విప్పి చూపించును; కఠినమయిన హృదయమును మృదువయినదిగా చేయును; మనస్సులోని తొందరలను పారదోలును, ఆ యాత్మ యిప్పుడు నన్ను విడిచిపెట్టిపోయెను; అయ్యో, పాపమనే అగ్నిమంటలు నా మనస్సులో మండుచున్నవి; నెమ్మదిపోయి దుఃఖములు వ్యాపించుచున్నవి । యేసుక్రీస్తు ॥

28. అకటా నన్విడనాడలేక పరిశుద్ధాత్ముండు దుఃఖంబుతో, నిక చాలించుము పాపము న్విడువుమంచే వేళ బోధింప నా, వికటోన్మాదము మాననైతి చెవికి న్విన్పించుకోనైతినా, యొక కాఠిన్యమనంబు కేమనుదునయ్యో యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

అయ్యో, ఆ పరిశుద్ధాత్మ నన్ను విడిచిపెట్టి పోలేక, ఓరీ పాపము చేయుట మానుమని యేవేళను నన్ను హెచ్చరించుచు వచ్చెను; గాని నేను నా వెఱ్ఱిబుద్ధి మాననయితిని; ఆ హెచ్చరికను విననయితిని; నా కఠినమయిన మనస్సునుగురించి యేమందును । యేసుక్రీస్తు ॥

29. ఆనందామృత వార్ధి వీచికల నుయ్యాలూఁగుచో నిర్మల, జ్ఞానధ్యాన వివేకనూన రసమిచ్ఛ న్మెచ్చుచుం గ్రోలుచో, హా నీవిప్పుడు నన్ను బాసి పరిశుద్ధాత్మా కడుం దూర మీా, వైనా వాయని బల్కి యేడ్తుమదినయ్యా యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

ఆనందమనే అమృత సముద్రముయొక్క అల మీద ఉయ్యాలూగుచు [=ఆనంద మనుభవించును] పరిశుద్ధమయిన జ్ఞానము ధ్యానము వివేకము మొదలగువాటిని ఆహాయని సంతోషముతో అనుభవించుచు నుండిన నన్ను ఇప్పుడు, ఓ పరిశుద్ధాత్మా, విడిచిపెట్టి దూరముగా పోతివేయని దుఃఖింతును । యేసుక్రీస్తు ॥

30. పరిశుద్ధాత్మ విశుద్ధ తత్వ గృహ ధర్మ ద్వారమా
మోక్ష పా, వురమా తెల్వుల పూరమా విమల సరోదార
కాసారమా, వరభక్తాత్మ విచారమా పరమదివ్య జ్ఞానమూలం
బనా, దురితం బెల్ల క్షమింపవే యని నుతింతుఁ యేసుక్రీస్తు
ప్రభో.

## తాత్పర్యము

ఓ పరిశుద్ధాత్మ, పరిశుద్ధతయను గృహమునకు ప్రవేశద్వారమా, పరము నుండి దిగి వచ్చిన పావురమా, జ్ఞాన సంపూర్ణాధారమా, పవిత్రతయను ఉదకముతో నిండిన సరస్సా, భక్తశ్రేష్ఠులలో ఆత్మీయ విషయములను ఆలోచింప జేయువాడా, మహా శ్రేష్ఠమగు జ్ఞానమునకు ప్రేరకుడా, నా పాపమంతా క్షమించుమా యని ప్రార్థింతును । యేసుక్రీస్తు ॥

31. అరిషడ్వర్గ మణంప నింద్రియ దురంతాసక్తి ఖండింప
దు, స్తర మాయా పటలంబు వోదరమ భక్తవ్రాతము న్మెచ్చ
నా, దురితాంధంబగు కన్నువిప్పి మది సంతుష్టియ్య రావయ్య
యో, పరిశుద్ధాత్మ యటంచు బిల్చెదను దేవా యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

నా యాత్మకు శత్రువులగు కామక్రోధాది ఆరు దుర్గుణములను నశింప జేయుటకును, దుస్స్వభావమును పీడించు దురాశలను హతము చేయుటకును, జయింప సాధ్యముకాని మాయల సమూహమును పారదోలుటకును భక్తులందరు నిన్ను మెచ్చుకొనునట్లుగా పాపమువల్ల దృష్టిపోయిన నా జ్ఞాననేత్రమును తెరచి నా మనస్సులో సంతోషము పుట్టించుటకును, ఓ పరిశుద్ధాత్మా, రావయ్యా అని ప్రార్థించుచున్నాను । యేసుక్రీస్తు ॥

32. ధారావృష్టిని నిర్మలోదకము లిద్ధాత్రీ స్థలింబారి వి,
స్తారంబౌ మలినంబులుం గడిగి యంత న్నొక్కచో నిల్చియుం,
దేరున్నట్టుల నా మనో మలినముం దీరంగ శుద్ధాత్మ నా, పైరా
నీవె సుధాప్రవర్ష మెద నింపఁ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

ధారలుగా వర్షము కురిసినప్పుడు నిర్మలమయిన ఉదకము భూమిమీద ప్రవహించి విస్తారమయిన మాలిన్యములను కొట్టుకొని వచ్చి వాటి నొక్క చోట చేర్చి తీరునట్లు చేయునుగదా; అదేవిధముగా ఓ పరిశుద్ధాత్మా నా హృదయములోని యపవిత్రతయంతా హరించిపోవునట్లుగా దానిని అమృతమువంటి నీ కృపయను వర్షముతో నా హృదయమును నింపుమని వేడుకొనుచున్నాను । యేసుక్రీస్తు ॥

మ॥ 33. జనకుం డాత్మజు డాత్మత్రైకుడ వనుచుఁ స్వాభావ మందైక్యముం, ఘనకార్యంబుల మువ్వేరంచు తన వాక్యంబు ల్ప్రబోధించు దే, వునికి న్నీకును జ్ఞానధర్మముల తావుల్ జూపు శుద్ధాత్మకుఁ, ఒనరంగన్, గుణభేద భావములు లేవో యేసుక్రీస్తు ప్రభో.

## తాత్పర్యము

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయను ముగ్గురు పురుషులున్నను, స్వభావమున కొక్కరేయని, కార్యములయందు ముగ్గురనియు నీ వాక్యము బోధించును; దేవునికిని నీకును, జ్ఞానమును మానవులు చేయవలసిన విధులను మానవులకు బోధించు పరిశుద్ధాత్మకును గుణభేదములు లేవుగదా । యేసుక్రీస్తు ॥

## ప్రార్థన స్తోత్రములు

శా॥ 34. పాలన్ముంచిన నీళ్లముంచిన భవత్పాదంబులే దిక్కుగా, నీలేదొండొక చోటనా తలపిక న్నీవంటి సద్రక్షకుం, డేలోకంబున లేడటంచు మది నే నే ప్రొద్దు వర్ణింతు నిం, కేలా యాలిశ మయ్యె నన్ననుప రావే యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

నన్ను పాలలో ముంచినా సరే, నీళ్లలో ముంచినా సరే, నీ పాదములే నాకు దిక్కుగా దయచేయుము, నా ధ్యానము మరి యెక్కడను లేదు, నీ

వంటి కృపగల రక్షకు డే లోకములో లేడని అన్ని వేళలను నిన్నుగూర్చి చెప్పుకొనుచున్నాను; ఏల యింకా జాగుచేయుచున్నావు? నన్ను రక్షించుటకు రావయ్యా । యేసుక్రీస్తు ॥

35. రావే నా మొర లాలకించుటకు ధైర్యం బిచ్చి రక్షింపవే, లేవే నా మది పెక్కు దుఃఖముల యేర్లింకించి నా విన్నపాల్, తేవే చిత్తమునందు వందనము లర్థింజేతు మోక్షార్థముల్, ఈవే నామది నిన్ను నమ్మితిని జుమ్మీ యేసుక్రీస్తు ప్రభో.

### తాత్పర్యము

నా విలాపము లాలకించుటకు రమ్ము; నాకు ధైర్యముచెప్పి నన్ను రక్షించుటకు లెమ్ము, నా మనస్సులోనున్న నానా దుఃఖముల ప్రవాహములను ఆరగట్టి నా విన్నపములకు చిత్తగించుము; నీకు మనఃపూర్వకములైన వందనములు చెల్లింతును; పరమార్థవరములు దయచేయుము; నా మనస్సునందు నిన్నే నమ్ముకొంటినయ్యా । యేసుక్రీస్తు ॥

36. లేదో నీ దయ దాసిగాని మన వాలించాపదల్బాపగా, రాదో రేబగ లార్త నాదమున జేరం జీరు దారిద్రుతో, వాదో లేక పరీక్ష చెల్లుగని బ్రోవన్ వేళ సామీప్యముం, గాదో నా బలిమేను నీ కరుణ గాకన్ యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

నీకు నామీద దయలేదా? నీ దాసుని మనవి విని వాని కష్టములను పోగొట్టరాదా? రాత్రింబగలు దుఃఖాలాపముచేయుచు నీయొద్దికి వచ్చుచున్న యీ దరిద్రునితో వాదమా? లేక పరీక్షించవలెనని రక్షించుటకు సమయమింకా రాలేదా? నీ కృప రాకపోతే నా బలవంతముననైన రక్షింపుమీ । యేసుక్రీస్తు ॥

37. బరువో నా దురితంబు లానుటకు నాపై నీ కటాక్షం బిడన్, కరువో నా కనుగొల్కులం దొలుకు బల్ కన్నీళ్ల

నీ రాడ నీ, చెరువో కల్వరిమెట్టపై రుధిరముం జిందించి మేనిచ్చు టల్, అరువో రొక్కము దెల్పక న్విడువ నయ్యా యేసుక్రీస్తు ప్రభో.

తాత్పర్యము

నా పాపములు మోయుటకు నీకు భారమాయెనా? నామీద నీ కృప చూపుటకు కరువాయెనా? పశ్చాత్తాపమువల్ల నా కన్నులనుండి కారు కన్నీరుతో నీ చెరువు నిండరాదో? కల్వరిమీద నీ రక్తము కార్చి నీ శరీరమిచ్చుట అరునా? ఉచితమయిన దానము కానియెడల నేనేమి ఖరీదు ఇయ్యవలెనో చెప్పితే నేగాని నిన్ను విడువనయ్యా। యేసుక్రీస్తు॥

శ్లో॥ 38. నా శోక ధ్వని వీనులం బడదట న్నా దుఃఖవారాశిలో, భాసిల్లే నను దీనుగాచుటది తప్పా లేక నీ యందు వి, శ్వసించే మది లేని సాక్షి గనినావా జాలమింకేల నీ, యాశీర్వాదములిచ్చి నన్నను పవయ్యా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

నా దుఃఖాలాపము నీకు వినబడుటలేదా? దుఃఖసముద్రములో పడియున్న నన్ను రక్షించుట నీకు తప్పయినదా? నీయందుండవలసిన విశ్వాసము నాలో లేదని నీకు తోచెనా? ఏల యీ యాలస్యము! నీ యాశీర్వచన మను గ్రహించి నన్ను రక్షింపరావయ్యా। యేసుక్రీస్తు॥

శ్లో॥ 39. మేలా దీనునిపట్ల నిష్ఠురత ప్రేమం జూపి యోదార్చరా, వేలా నీ పదపద్మముల్ గొలుచుచున్ విశ్వాసినైయుంటకుం, చాలా కోరుదు నింతకంటె మరి సౌఖ్యం బెద్దియే నింక నొం, డేలా వేడగ ముక్తి నీవె గద తండ్రీ యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

ఈ బీదవానిమీద నింత కాఠిన్యము చూపుట ధర్మమా? నీ ప్రేమ చూప నన్నాదరింప నేల రావు? నీ పాదపద్మములను సేవించుచు నీ భక్తుడయి

యుండగోరుచున్నాను; ఇంతకంటె నాకు సుఖము లేనేలేదు; నేను మరి యేమియు కోరుటలేదు; నీవేగదా నాకు మోక్షభాగ్యము, తండ్రీ। యేసుక్రీస్తు॥

శా॥ 40. కన్నుల్ తేజముదప్పి రేలు బగలుం గారేటి నీరంబు
లె, న్నెన్నో నీ కొలలోన నుంచి యిపుడీ నృత్యంబుగా జూచు
టల్, చన్నే నిన్నటి నేటి ప్రేమలొకొ నా జన్మాదిలోనెంచి నా,
వన్నాయే నినునీవు నన్నెరుగుదయ్యా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

కన్నులలోనున్న కళతగ్గిపోవునట్లు రాత్రిపగలు కారుచున్న నా కన్నీళ్లను నీ కొలలో భద్రముచేసియుంచి యిప్పుడు ఈ యాట చూచుచున్నట్టుండుట నీకు న్యాయమా? నామీద నీకున్న ప్రేమ యీ యొకటి రెండు దినములదా? నేను పుట్టినప్పుడే నన్ను ఏర్పరచుకొంటివి గదా?। యేసుక్రీస్తు॥

మ॥ 41. నను పో పొమ్మన లేవు అంటివె భవన్నామ కృపాసత్య
వ, ర్తన లేమాయెను వాదురాదె యిక నోర్వంజాల నా పాప
మెం, చిన నీ వాగ్దయలెంతు నేను నను బ్రోచే రక్తసిక్తాశ్రితా,
వనపాదంబులు జూపక న్విడను దేవా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

నన్ను నీ దగ్గర జేరకుండా పారదోలలేవు; పొమ్మంటివా, నీ పేరు నిలుచునా? నీవు కృపగలవాడవు, సత్యసంధుడవన్న బిరుదు చెడిపోదా? నీకు అప్రతిష్ఠరాదా? ఇక నేను తాళలేను; నీవు నా పాపములు లెక్కపెట్టసాగితే నేను నీ వాగ్దానములు లెక్కపెట్టుదును; నన్ను రక్షించే రక్తములో తడిసిన నీ పాదపద్మములను నాకు చూపకుండా నిన్ను పోనియ్యను దేవా। యేసుక్రీస్తు॥

శా॥ 42. జాలం బేటికి జేతువన్న యిదె సంసారోగ్ర దావానల,
జ్వాలల్ పెకొని గ్రమ్మె దుస్తర మనస్తాపంబు వాటిల్లెనా, పాలిం
టం గడు శత్రువయ్యెను స్వభావంబింక నావంక నీ, వాలోకింప
గదయ్య నెయ్యమున నయ్యా యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

ఆలస్యమేల చేసెదవు! అజ్ఞానము లౌక్యమనే భయంకరమైన కారు చిచ్చుమంటలు నా మీదికి రగులుచున్నవి; మానని దుఃఖము ప్రాప్తించినది; నా స్వభావమే నాకు గొప్ప శత్రువైనది; ఇక నన్ను నీ దయతో చూడవయ్యా। యేసుక్రీస్తు॥

శా॥ 43. మోక్షాంతర్వర సౌధ మంటప సభా ముఖ్యుండవౌ
నీవు నా, పక్షంబై కరమెత్తి యార్తుడగు నిప్పాపాత్ము రక్షింతు
నా, దక్షత్వం బిదియంచు బల్కిన భవత్సభ్యుల్ నివారింతురే,
యాక్షేపింతురె యెందుకీ తడవులయ్యా యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

పరమపురియందున్న నీ దివ్యమందిరమందు కొలువుకూటమున ప్రధాన పురుషుడవుగానుండు నీవు నా పక్షమువహించి నీ చెయ్యి యెత్తి నావైపు చూపి నేనీ పాపిని రక్షింతును, నా శక్తిని చూడండి యని నీవు పలికినయెడల నీ సభలోనున్నవారు నిన్ను వద్దందురా! ఆక్షేపింతురా! ఏల యీ ఆలస్యము!। యేసుక్రీస్తు॥

శా॥ 44. ఆపోస్తల్మరి దీర్ఘదర్శులును నిత్యాత్మల్ మహాదూతలు,
న్మాపుల్ రేపులు లేని శోభిత సభా మధ్యంబునం గొల్వ శ్రే,
యో పీఠంబున నీవు నిత్యసుఖివై యుండంగ నా తాపము,
ల్వాపోవుల్ దెగునెట్లు రావె కరుణింపన్ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

అపొస్తలులు, దీర్ఘదర్శులు, దూతలు, ముక్తులయిన పరిశుద్ధుల సమూహములను రాత్రి పగలనే భేదములేని ఆ పరమపురి కొలువుకూటమునందు నిన్ను కొల్చుచుండగా నీవు మంగళప్రదమయిన సింహాసనమునందు నిరంతరము సుఖముగా కూర్చుండి యూరక చూచుచుంటే నా దుఃఖమును విలాపములును ఎట్లు తీరును? లేచివచ్చి నన్ను కరుణింపుము। యేసుక్రీస్తు॥

శా॥ 45. నిత్యానందము పూర్ణశాంత రసము న్నిర్వైరమున్
శాస్త్ర సాం, గత్యం బాత్మ కొసంగవే యనుచు వేడన్నిన్ను

ప్రార్థింతు నీ, భృత్యశ్రేణులలోన నన్నొకనిగా వీక్షించి రక్షించి నా, భత్యం బియ్యవె నెమ్మనం బదియె దేవా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

నిత్యముండు ఆనందమును పూర్ణశాంతమును ఎవరియెడలను విరోధము లేని ప్రేమయును వేదవాక్యానుభవమును నాకు దయచేయుమని నిన్ను ఆశతో వేడుకొనుచున్నాను, నీ దాసకోటిలో నన్నొకనిగా చేర్చుకొని రక్షించి అను దిన భత్యము దయచేయుము, అదే నాకు నిండుసంతోషము। యేసుక్రీస్తు॥

శా॥ 46. ఎన్నాళ్లీ ధరమీాదనున్న నను నీ యంఘ్రిద్వ యీా భక్తి సం, పన్నుంగా నొనరించు మా పయిని చావంబోవు కాలం బునం, దెన్నంగ రాని ముదంబొసంగు మటపై నేమిచ్చెదో దెల్పలే, నన్నా యావలిదియ్య నీ వెరుగు దయ్యా యేసుక్రీస్తు ప్రభో.

తాత్పర్యము

ఎంతకాలము నన్నీ లోకములో నుంచుదువో అంతకాలము నీ పాద భక్తిభాగ్యము నాకు దయచేయుము; తరువాత మరణసమయము వచ్చినప్పుడు నిండయిన సంతోష మను గ్రహింపుము; ఆ తర్వాత నీవు నాకేమి యిత్తువో చెప్పజాలను; అది నీకే తెలుసును। యేసుక్రీస్తు॥

మ॥ 47. మననే మానస మర్మసాక్షియగు భూమానుష్యులుం దూతలుం, గనుగోలే రటువంటి మానసము నిష్కాపట్యముం జేయనే, మనుజుం డోపడటంచు శాస్త్రమును ప్రామాణ్యంబుగా జెప్పు మ, మ్మనసాంతర్గత కల్మషం బణచుమన్నా యేసుక్రీస్తు ప్రభో.

తాత్పర్యము

మనస్సే మనస్సునకు సాక్షిగానుండును (అనగా నొకరి మనస్సు మరి యొకరికి తెలియదని) లోకములోని మానవులుగాని పరలోకములోని దేవ దూతలుగాని తెలిసికొనలేరు; అటువంటి మనస్సును నిష్కాపటమైనదిగా

చేయుట కెవరితరముకాదని వేదవాక్యము చెప్పుచున్నది, అట్టి నా మనస్సు లోపలనున్న పాపమును పోగొట్టుము। యేసుక్రీస్తు॥

మ॥ 48. తెలివైయుండియు నిద్రబోవు నరునిం దెల్పంగ నిద్రా
రుణీ, తలమందేరికి శక్యమే యిటులనే తప్పొప్పులుం బుద్ధిలో,
తెలిసే తెల్వినినుండి పాప తమసా ధీనుండనై మిత్తివా, కిలి
లోకునికృతి లేపినావు తవశక్త్యై యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

మెళుకువనుండియు నిద్రబోవుచున్నట్టు నటించువానిని లేపుట లోకములోనుండు మానవునికి కష్టమయిన పనిగదా! అదేవిధముగా ఇది తప్పు అది యొప్పు అన్న జ్ఞానముండియు పాపాంధకారముచేత కప్పబడినవాడనై మరణమనే గుహాద్వారములో పడి నిద్రించుచున్న నన్ను నీ శక్తిచేత లేపితివి। యేసుక్రీస్తు॥

శా॥ 49. కన్నాసంజని గుడ్లపై నొదిగి రెక్కల్మూసి బల్ప్రేమ
నాఁ, కొన్నన్ ఎందునుఁబోక కుక్కుటముపై గూర్చుండు నా
రీతినా, పన్ను న్న న్ను భవద్దయా ప్రియములొప్పం జూచి నీ
రెక్కచా, యన్నన్నెప్పుడు దాఁచి బ్రోవగదె దేవా యేసుక్రీస్తు
ప్రభో.

తాత్పర్యము

తాను పెట్టినవన్న తలంపుతో కోడి గుడ్లమీద కూర్చుండి రెక్కలతో వాటిని కప్పి యెంతో ప్రేమగలదై ఆకలిగొన్నను ఎక్కడికి లేచిపోక యుండును; అదేరీతిగా దీనుడనైన నన్ను నీ దయతోను ప్రేమతోను చూచి నీ రెక్కల చాటున నన్ను దాచి రక్షించుము దేవా। యేసుక్రీస్తు॥

మ॥ 50. హరిదశ్వుం డొక జ్యోతి రింగణముపై నత్యుగ్రతం
జూడనా, పురువేమైన నెదుర్కొనం గలదె పాపుందీనునిన్ నన్ను
నీ, కరముంభారముగా శిరంబుపయి నల్కన్ బెట్టినన్ ఓర్వ నా,
తరమే నే ప్రతివాదినే కరుణ రాదా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

సూర్యుడు మిణుగురు పురుగుమీద కోపముతో చూచినయెడల అది సూర్యుని నెదిరించగలదా? పాపిని దీనుడనైన నామీద నీవు కోపగించి నీ హస్తమును నా శిరస్సుమీద భారముగా పెట్టితే నేను తాళగలనా! నేను నీకు ప్రత్యుత్తరమీయగలనా! నీకు నా మీద దయలేదా? । యేసుక్రీస్తు ॥

శా॥ 51. ఓ దాహాతురులారా నా కడకు రారో వాక్యముం
ద్రావుడా, మీదన్ తేనియలూరు నేరుగడు తాలిన్ బారు మీ
లోననే, నీ దివ్యోక్తుల భావమెంచి మది నెంతేనిం తృష్ణాతుం
డనై, నీ దాపుక్ గని జేరితిక్ కరుణరానీ యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

దాహముచేత బాధపడుచున్నవారలారా, నావద్దికి వచ్చి దేవవాక్యమను అమృతమును త్రాగండి; అప్పుడు మీలోనుండి తేనెలు ఏర్లుగా బారునని నీవు సెలవిచ్చిన మాట భావము మనస్సులో ఆలోచించి యెంతో ఆత్మీయ దాహము గలవాడనై నీవద్దికి వచ్చితిని, దయచూపుము । యేసుక్రీస్తు ॥

మ॥ 52. అణుమాత్రంబు భవత్కృపాబలము నా కందిచ్చినక్
చిత్తదు, ర్గుణముం ద్రుంతు పిశాచదుర్నయ రణత్కోదండ
టంకారదు, ర్గుణముం ద్రుంచెద పాప దుష్ఫల మనోవృక్షంబు
గూలంగతత్, క్షణముం ద్రుంచెద నీ జయోన్నతులు హెచ్చక్
యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

నీ కృపాబలమెంత కొంచెమయినను నా కనుగ్రహించితే నా దుష్ట స్వభావమును గెల్చెదను, సాతాను పాపమను విల్లుతో యుద్ధముచేయబూనిన నా దుర్గుణములను నశింపజేయుదును; పాపసంబంధమైన విషపు ఫలములు ఫలించు నా మనస్సును గొప్ప వృక్షమును ఒక్క క్షణములో పడగొట్టుదును, అప్పుడు నీకు ఘనత కీర్తి కలుగును । యేసుక్రీస్తు ॥

మ॥ 53. ఇల దావీదను రాజుతొల్లి కృపచేనేర్పడ్డవాడైన్ననుం,
బలు పాపంబున బడ్డ దేవుడు దయక్ మన్నించి కాపాడినిన్,

శ్చలసద్భక్తి యొసంగిలేపె నిపుడా చందంబు నన్నీవు నా, బల
వత్పాప మణంచి యెత్తుటకు రమ్మా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

పూర్వకాలమందు దావీదను రాజు దేవుడేర్పరచుకొన్నవాడై యుండియు ఘోరపాపములో పడినప్పుడు దేవుడతనిని దయతో క్షమించి స్థిరమయిన భక్తి దయచేసి లేవనెత్తెను; అదేవిధముగా ఇప్పుడు నా ఘోరపాపమును అణగగొట్టి నన్ను లేవనెత్తుటకు రమ్ము। యేసుక్రీస్తు॥

54. నీతో చచ్చెదనంచు పేతురుడు నిర్ణీతుండునై వెన్క-
హ్నాఁ, ద్భీతిఁ బొంకెను పాపముం దెలుపు నీ దృగ్దృష్టి జూపిం
చినం, జేతో దుఃఖముబొంది నిన్ననుసరించెఁ మరణపర్యం
తమా, రీతిఁ నా దురితంబుబాపి దయ నీవే యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

పేతురను నీ శిష్యుడు నీతోకూడా మరణముపొంది స్థిరముగానున్నానని చెప్పెనుగాని పిరికితనముచేత అబద్ధములాడినప్పుడు అతని పాపము నతనికి చూపించుటకై నీవు చూచిన చూపువల్ల మనస్సు కరిగి దుఃఖించి బ్రతికినంత కాలము నిన్ను వెంబడించెను; అదేవిధముగా నా పాపము తీసివేసి నామీద దయచూపుము। యేసుక్రీస్తు॥

55. ఏ కాలంబుల నాటి చుట్టములు నీ కెన్నంగ నాలా
జరుం, డాకంజాయత నేత్రయా మరియ యింకా పౌలసా
చోరుడుఁ, లోక ఖ్యాతిగ నెంచి వారిని దయాళుత్వంబుతో
బ్రోచి నా, వీకాలంబున నన్ను బ్రోచుటకు రావే యేసుక్రీస్తు
ప్రభో.

తాత్పర్యము

నీకు వా రేకాలపు బంధువులని వారిని నీ లెక్కలోకి తెచ్చితివి? ఆ లాజరు, మరియయను ఆ స్త్రీ, ఆ పౌలు, ఆ దొంగ మొదలగువారిని లోక ప్రసిద్ధులుగా నెంచి దయతో రక్షించితివి; ఇప్పుడు నన్ను రక్షించుము। యేసుక్రీస్తు॥

మ॥ 56. ఒడయా నీ దయచేత నెంచిన మనుష్యుం డేడేడు
మార్లాపదం, బడినం దోడనే లేచు త్యక్తుడొక తేపర్ బడ్డవా
డింక నె, న్నడు లేవండని బలుక వాక్యమిదిగో నా పట్ల
నీడేరెనా, పడుటల్ నీ కృప నెత్తుటల్గలిగె దేవా యేసుక్రీస్తు
ప్రభో.

తాత్పర్యము

ఓ ప్రభువా, నీవు దయతో ఏర్పరచుకొన్నవాడు ఏడేళ్లసార్లు ఆపదలో పడినను, వెంటనే లేచును; నీవు విడిచిపెట్టినవాడు ఒక్కసారి పడినను తిరిగి లేవడన్న మాట యిప్పుడు నా విషయములో నెరవేరినది; నే నెన్నిసార్లో పడితిని నీ వెన్నిసార్లో నన్ను దయతో లేవదీసితివి। యేసుక్రీస్తు॥

మ॥ 57. తలిదండ్రుల్ తమ ముద్దు కుర్రల యెడం దప్పుండి
నర్ తాడనం, బులు పైకిత్తురు చిత్తముల్ కరుణతో పూర్ణం
బుగా నుంతురా, వలెనే నా బలు తప్పులుంగని దయా భావం
బులోనుంచి వె, ల్పల దండించితివిందు మేల్గలిగెనప్పా యేసు
క్రీస్తుప్రభో.

తాత్పర్యము

దలిదండ్రులయినవారు తమ ముద్దుబిడ్డలు తప్పుచేసినప్పుడు పైకి శిక్షింతురు గాని హృదయములలో దయ పూర్తిగానుండును, అదేరీతిగా నా గొప్ప పాపములు చూచి బయటికి నన్ను దండించినను నీ హృదయములో నామీద దయ తలచితివి; ఇట్లు దండించినందువల్ల నాకు మేలే కలిగెను॥ యేసుక్రీస్తు॥

శా॥ 58. పాపం బెచ్చట విస్తరించెనో కృపా బాహుళ్య
మచ్చోట ను, ద్దీపించెర్ మరి యెర్కైన కలుషాధిక్యంబు
మన్నింతువో, నీపై వారల ప్రేమ మెక్కువగు వర్ణింపంగ నీ
వాక్యముల్, జూపట్టెర్ మును మరియచో నిపుడు నాచో
యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

పాపమెక్కడ విస్తరించెనో దేవుని కృపయు అచ్చట విస్తరించెనన్న వాక్యమును, ఎవరి కెక్కువ పాపములు నీవు క్షమింతువో వారికి నీ మీద ఎక్కువ ప్రేమ యుండునన్న వాక్యమును, మునుపు మరియు విషయములోను ఇప్పుడు నా విషయములోను దృష్టాంతపరచ బడియున్నవి । యేసుక్రీస్తు ॥

### ప్రభువుయొక్క శ్రమలు తలంచుట

మ॥ 59. మరియూ సూనుడు వడ్లవాని సుతు డీ మానుష్యుడు
న్నీవని సో, దరులున్నారిదె వీనికిట్టి పరమార్థజ్ఞాన మెట్లబ్బెనం,
చరుదొందే నరకోటిలో దిరుగు మోక్షానంద దాయీ పరా,
త్పరు ప్రేమాత్మజుడంచు నిన్నెరుగ రబ్బా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

ఇతడు మరియ కుమారుడు వడ్లవాని కొడుకు, ఇతని సోదరు లిక్కడ నున్నారుగదా? ఇతనికింత పరమార్థజ్ఞాన మెక్కడినుంచి వచ్చినదని ఆశ్చర్య పడిన నరులలో నీవు సంచరించితివి; నీవు నరులకు మోక్షానందము నిచ్చువాడ వని, దేవుని ప్రియపుత్రుడవని వీరెరుగక పోయిరిగదా । యేసుక్రీస్తు ॥

మ॥ 60. తవ భక్తాళికి మోక్షమిచ్చుకొరకై దారిద్ర్య
మైనట్టి మా, నవ రూపంబు ధరించి గ్రామపుర కాంతార
ప్రదేశంబులకా, సువిశేషోక్తులు చాటి యద్భుతములం జూపించి
యూదాళిచే, నవమానంబగు సిలువపై బడితివయ్యా యేసు
క్రీస్తుప్రభో.

### తాత్పర్యము

నీ భక్తకోటికి ముక్తి యిచ్చుటకయి బీదమనుష్యుని యవతారమెత్తి గ్రామ ములలోను, పట్టణములలోను, అరణ్యములలోను, సువార్త ప్రకటించుచు అద్భుతకార్యములు చేసి యూదులచేత అవమానకరమగు సిలువమరణము నొంది తివిగదా । యేసుక్రీస్తు ॥

సా॥ 61. అంధుల్ చంద్రుని బొల్పు గానని గతిన్ అత్యంత
దుర్వార గ, ర్వాంధుల్ యూదులు శాంత సాగరుని మోక్షా
నంద చంద్రున్నినున్, అంధత్వంబున గానలేక తుద నాహా
సిలువపై మేకులన్ సంధించుగ్రత జంపిరే పలువురిచ్ఛన్
యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

గ్రుడ్డివాడు చంద్రుని సౌందర్యము చూడ నేరనట్లు విస్తారమయిన గర్వముచేత మానసికాంధులయిన యూదులు శాంత సముద్రుడవును పరలోకానందము నిచ్చువాడవునైన నిన్ను కానలేక చిట్టచివరకు నిన్ను సిలువకు మేకులతో అంటగొట్టి మహా కోపముతో ఇష్టమువచ్చినట్లు చంపిరిగదా। యేసుక్రీస్తు॥

మ॥ 62. నరలోకామిత పాపభారములు మేనంబూని యూదా
ళిచే, మరణావస్థను బొందు ముందు నొక గ్రావంబొద్ద చిత్తాం
తరా, తురతన్ బ్రార్థనసేయ నీ తనువునందున్ స్వేదముం,
గొప్ప నె, త్తురు బొట్లై భువి రాలె నే నవి దలంతున్ యేసు
క్రీస్తుప్రభో.

### తాత్పర్యము

మానవకోటియొక్క అపరిమితమయిన పాప భారమును నీ శరీరమున భరించి యూదులచేత చంపబడకముందు నొక గుహవద్ద మనోవేదన నొందిన వాడవై ప్రార్థన చేయగా నీ శరీరమునుండి చెమట బొట్లు నెత్తురు చుక్కలుగా భూమిమీద రాలెనే; నేను వాటి నిప్పుడు స్మరింతునయ్యా। యేసుక్రీస్తు॥

శా॥ 63. ఆ గాఢంబగు రాత్రివేళను ప్రధానాచార్య ప్రేరే
పణన్, రాగాంధంబున యూదసైనికులు మార్గంబిచ్చు
యూదాసుతో, వేగన్ గెత్సమనే వనాంతరము బల్మింజొచ్చినన్

గట్టిరెం, తో గర్వంబున నట్టికాల మెద నెంతుఁగా యేసుక్రీస్తు ప్రభో.

### తాత్పర్యము

ఆ కటిక చీకటి రాత్రి వేళ ప్రధానయాజకుని ఆలోచనచొప్పున ఆ చీకటిలో రాణువవారు యూదా యిస్కరియోతు దారిచూపగా గెత్సెమనే యను తోటలోకి వచ్చి నిన్ను అహంకారముతోను బలాత్కారముగాను పట్టి కట్టి తీసికొని వెళ్లిరి. ఆ సమయమున జరిగినది నేను తలపోయుచును । యేసుక్రీస్తు ॥

మ॥ 64. తలపై ముండ్ల కిరీటముంచి కఠినుల్ దండించి రావెన్క చే, తులు పాదంబులు సిలువ మ్రాని నిడి దుర్దోషుల్ వెసం గట్టి మే, కులతో గొట్టిరి పార్శ్వమందు గడు మూర్ఖుల్ బల్లెముం గ్రుచ్చిరా, వలి నీ దుఃఖము లెన్న నా తరమె దేవా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

ఆ కఠినచిత్తులు అప్పుడు నీ తలమీద ముండ్లతో నల్లిన కిరీటముంచిరి; తరువాత ఆ పాపాత్ములు నీ కాలుచేతులు సిలువకొయ్యకు కట్టి మేకులతో నంటగొట్టిరి; కొందరు మూర్ఖులు నీ డొక్కను బల్లెముతో పొడిచిరి; ఆ మీద నీ వనుభవించిన వేదనలను వివరింప నా తరమా । యేసు క్రీస్తు ॥

మ॥ 65. కరపాదానన పార్శ్వ దేశముల రక్తంబంగముం గప్పి సుం, దర బాలారుణ బింబ మె ట్లుదయ గోత్ర బెక్కునో యట్లు క, ల్వరిపై నెత్తెడు మ్రానియందు తవ రూపంబొప్పె భక్తాంబుజా, కరములొప్పంగి ప్రఫుల్లమై ప్రియము లొల్కఁగా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

చేతులు కాళ్లు ముఖము డొక్కనుండి కారిన రక్తముతో నీ శరీరమంతా కప్పబడి, ఉదయమున సూర్యబింబము ఎర్రగాను సుందరముగాను ఉదయాద్రి నెట్లు ఎక్కునో అట్లు కల్వరి కొండమీద నెత్తబడిన సిలువమీద

నీ స్వరూపము ప్రకాశించెను. ఇది చూచి నీ భక్తుల హృదయములు ఆనందముతో నిండి ప్రేమతో పైకి పొంగును; అందుకు ఉపమానము సూర్యోదయమున తామరలు వికసించి తేజరిల్లును గదా। యేసుక్రీస్తు॥

66. సిలువన్ బ్రాణములంటగట్టి తనువున్ క్షీణంబుగా
కుండ చిల్లుల భంగిన్ వెస రక్తధారలరికాలుం గేలులం బారగా,
తలయున్ వంచి మృతించి వెన్క పునరుత్థానుండవై కూర్మి భ,
క్తులకుం జూపిన రూపు జూపగదె నాకున్ యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

సిలువమీద నిన్ను అంటగొట్టినప్పుడు నీ దేహము నీరసించునట్లుగా రక్తము కుండ చిల్లులలో నుండి నీరు కారినట్లు అరికాళ్లనుండియు చేతులనుండియు కారెను; అప్పుడు నీవు తలవంచి ప్రాణము విడిచితివి; పిమ్మట పునరుత్థానము నొంది నీ ప్రియభక్తులకు నీ రూపమును చూపితివే; ఆ రూపము నాకిప్పుడు చూపుము। యేసుక్రీస్తు॥

67. మ్మూడవనాడు సమాధిలోన దురితంబుల్ డించి
స్వాతంత్ర్యముం, గూడం జీవము దాల్చి లేచి మహిమోక్తుల్
బల్కుచున్ శిష్యులుం, జూడం గాయములన్ని జూపి ధృతియుం
జొక్కంబుగా నిచ్చిమిన్, జూడన్ మోక్షము కేగినాడవు నిజే
చ్ఛన్ యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

మృతిపొందిన మూడవదినమున మానవకోటి పాపములు సమాధిలో దిగ విడిచి స్వశక్తిచేత తిరిగి సజీవుడవై లేచి మహిమగల వాక్యములు శిష్యులతో చెప్పి వారికి నీ శరీరమందలి గాయములన్ని చూపించి వారికి ధైర్యము పుట్టించి, వారు ఆకాశమువైపు చూచుచుండగా పరలోకమున కెక్కిపోతివి॥ యేసుక్రీస్తు॥

## అన్యజనులను పిలుచుట

శా 68. ఓహో యీ నరులార మీ మదిని నుయ్యో కొండ
యో యంచు సం, దేహాల్ మానుడి కల్వారీ గిరి దరిం దృష్టించి
చూడుండి మీ, యూహాపోహము లెల్ల బోయి మదిలో నుద్వి
గ్నముం గల్గుగా, యాహారండని చెల్మితో బిలుతునయ్యా యేసు
క్రీస్తుప్రభో.

### తాత్పర్యము

ఓ మానవులారా, యిది నుయ్యో కొండో అన్న అనుమానము మీ మనసులో ఉంచుకొనకండి, కల్వరికొండవైపు చూడండి; మీ అనుమానములన్నిపోయి మనశ్శాంతి కలుగును, ఆహా రండి అని ప్రేమతో నా తోటి మానవులను బిలుతును। యేసుక్రీస్తు॥

శా 69. రారే మానవులార క్రీస్తు మనలన్ రక్షింపగా వచ్చె
నా, భారంబూనె నటంచు భేరిగొట్టుచున్ భాంకారభాంకార
భాం, కారారావముతోడ చాటెదను లోకంబందు నీ నామమే,
సారంబంచు వచింతు నీ జనులు మెచ్చన్ యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

రండి మానవులారా, యేసు మనను రక్షింపవచ్చెను, నా పాపభారము మోసెనని భేరి వాయించుచు భాంకారధ్వని చేయుచు అందరికి చాటించుచును; నీ భక్తులు మెచ్చుకొనునట్లుగా నీ నామమె మహా శ్రేష్ఠమైన నామమని చెప్పుదును। యేసుక్రీస్తు॥

మ 70. వినుడీ మానవులార చోద్యమిదిగో యిమ్మానుయే
లాఖ్యచే, మనతో దేవుడు గూడనుండెనను తద్భాషార్థమా
దీర్ఘద, ర్శుని వాక్యంబిదె కన్యకాతనయుడై క్షోణీతలిం బుట్టెయే,
సునిపేరన్ వెసరారె చూతమని బిల్తున్ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

మానవులారా, యీ ఆశ్చర్యము వినండి. యేసుక్రీస్తు ఇమ్మానుయేలను పేరుపెట్టుకొని కన్యకయైన మరియ గర్భమున భూలోకమున బుట్టెను; ఇమ్మానుయేలను మాటకు దేవుడు మనకు తోడైయున్నాడని భాషాంతరము; ఆయనను చూతము, త్వరగా రండి యని పిల్తును । యేసుక్రీస్తు ॥

మ॥ 71. అదిగో ముందట ప్రార్థనాగిరివరం బావాంకఁ జూ
పుమే, రదిగో గెత్సెమనే వనస్థలి ప్రధానాచార్యు నట్టాలకం,
బదిగో కల్వరిమెట్ట రక్షకుని దుఃఖావస్థలుం జూడవె, ల్లుద మో
హిలా సఖులార రండనుచు బిల్తుఁ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

అదిగో మనమందర ప్రభువు ప్రార్థించుటకు వెళ్లుచువచ్చిన కొండ, ఆ వైపు కనుచూపు మేరదూరమున గెత్సెమనే తోట, ప్రధానయాజకుని మందిర మదిగో చూడండి, యిదిగో కల్వరిగుట్ట, మన రక్షకుని దుఃఖమును వేదనలును చూడబోదము రండియని బిల్తును । యేసుక్రీస్తు ॥

శా॥ 72. నానాకార్య నితాంత చింతల దినాంతంబౌను ఆ
మీాదటన్, రే నిద్రించును తెల్లవారుపిదపఁ రేపయ్యె లెమ్మంచు
పూ, ర్వానూన క్రియలన్ని చుట్టుకొను నాహా దుఃఖసంసారి
కిఁ, జ్ఞానం బెక్కడసౌఖ్య మెక్కడ తలంపఁ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

ఆయాపనులతోను అంతములేని చింతలతోను దినమంతా గడిచిపోవును; తర్వాత రాత్రిపూట నిద్రతో గడిచిపోవును, తెల్లవారగానే—లెండి, ఉదయమైనది యని వెనుకటిదినపు పనులన్ని మనుష్యుని ఆవరించుకొనును. అయ్యో! సంసారసాగరములో నున్నవానికి జ్ఞానమెక్కడిది! సుఖమెక్కడిది! । యేసుక్రీస్తు ॥

మ॥ 73. దురితావస్థను బొందు ముందు మది నెంతో మోద
ముప్పొంగు నా, తరువాతం దుదిలేని దుర్నరక సంతాపోగ్ర

దుఃఖంబులుం, బెరసుట తన్మదికెట్టులన్న సుఫలాపేక్షన్ పతం
గంబు వే, గిరమై దీపముజేరి బాధపడు భంగిన్ యేసుక్రీస్తు
ప్రభో.

### తాత్పర్యము

పాపస్థితిలో పడకముందు మనస్సు మహా సంతోషముగా నుండును. పడినతర్వాత అంతములేని నరకసంబంధమైన మనోవేదనయను దుఃఖమును ప్రాప్తించును; అందుకు దృష్టాంతము—దీపమును చూచి యేదో మంచి పండు అని భ్రమపడి రెక్కలపురుగు దానిలోపడి బాధపడునుగదా। యేసుక్రీస్తు॥

శ్లో॥ 74. చీమల్ పర్వతమూడు ద్రవ్వి పెకలించేటందుకుం
జాలునే, భూమింబుట్టిన సర్వజీవులును ఫూఃఫూత్కార వాతా
హతిన్, ఆ మార్తాండ మరీచు లార్పగలవే యట్లంధ మర్త్యాళినీ,
నామంబార్ప వృథాశ్రమల్ బడుదురన్నా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

చీమలు కొండశిఖరము త్రవ్వి పడద్రోయగలవా? భూమిమీద పుట్టిన ప్రాణులన్ని కలిసి ఫూ ఫూ అని యూదుటచేత సూర్యుని కిరణములను ఆర్పివేయగలవా! అదేరీతిగా అంధులయిన మానవకోటి నీ నామమును ఆర్పివేయవలెనని పడు శ్రమ వ్యర్థమయిపోవునుగదా। యేసుక్రీస్తు॥

### అన్యదైవములు పట్టిపి

శ్లో॥ 75. తారానీకము లంధకార నిశినిం దర్శింప లేనట్లు నీ,
హారోద్య న్మృదుబిందు బృందములు దాహం బార్ప లేనట్లు ని,
స్సారాచార దరిద్ర దేవతలు మత్స్వాంతాంతర ధ్వాంతముం,
బారం దాపము లారజేయదగ రబ్బా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

నక్షత్రముల సమూహమంతా కలిసి రాత్రి చీకటిని పోగొట్టలేదు; మంచుబిందువు లెన్ని చేరినను మనుష్యుని దాహ మార్పలేదు. అదేవిధముగా సారములేని దేవతలెందరయిన నా మనస్సుకున్న అజ్ఞానాంధకారమును పోగొట్ట లేరు; నా దుఃఖమును చల్లార్చలేరు । యేసుక్రీస్తు ॥

మ॥ 76. మహిలో నంధులు గుడ్డివారలకు త్రోవల్ జూపగా
నేర్తురే, యహిదష్టు ల్వెసతేలు గుట్టు నర దుఃఖావస్థలుం దీర్తురే,
బహు పాపంబులొనర్చు వేల్పులిలలో పాపాత్ములం బ్రోచుటె,
ట్ల హాహా నీ కృపంగాద నే బ్రతికితయ్యా యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

ఈ లోకములో గ్రుడ్డివారు గ్రుడ్డివారిని సరియైన దారిలో నడిపించ గలరా! పాము కరచి బాధపడుచున్నవారు తేలుకుట్టిన వారి బాధను తీర్చ గలరా! అనేక పాపకార్యములు చేసిన దేవతలు పాపాత్ములనెట్లు రక్షింపగలరు? ఆహా! నేను నీ కృపవల్లకాదా రక్షింపబడితిని । యేసుక్రీస్తు ॥

శా॥ 77. ప్రాణాయామము సల్పినన్ హరి శివ బ్రహ్మాది
విఘ్నేశగీ, ర్వాణ శ్రేణులగొల్చినన్ సకల తీర్థస్నానముల్
చేసినన్, ప్రాణాయాసమెగాక సత్ఫలము గోరంతైన లేదెయ్యె
డన్, త్రాణాదాయము నిచ్చు నీ మరణ పుణ్యంబే యేసు
క్రీస్తుప్రభో.

### తాత్పర్యము

కఠినమయిన యోగాభ్యాసము చేసినను, బ్రహ్మ విష్ణు మహేశ్వరులను విఘ్నేశ్వరాధి దేవేతర సమూహమును బూజించినను, ఎన్నెన్ని పుణ్యానదులలో స్నానము చేసినను ప్రాణాయాసమేగాని పుణ్యము లేశమాత్రము లభింపదు; రక్షణభాగ్యము నీ మరణమున నీ పుణ్యముమాత్రమే యిచ్చును । యేసుక్రీస్తు ॥

శా॥ 78. మేనం బ్రాణములుండె కన్నుగవలున్ వీక్షించె
శబ్ధార్థముల్, వీనుల్ సోఁకె వినంగ బుద్ధికిది మేలీవస్తువుం గీడనే,
న్యూనాధిక్య తెరుంగు తెల్వి దనలోనుండెన్ మనుష్యుండయో,
మానున్మన్నను రాతినిం గొలుచునబ్బా యేసుప్రభో.

### తాత్పర్యము

శరీరములో ప్రాణముగలదు; నేత్రములు రెండును చూడగలవు; చెవులు మాటలు వినగలవు; ఇదిమంచిది యిదిచెడ్డది యను భేదము మనస్సు గ్రహించును. ఇట్టి శక్తులుగల మానవుడు కొయ్యను రాళ్లను మంటిని పూజించుట యెంత విచారకరము । యేసుక్రీస్తు ॥

మ॥ 79. వినుమీ కంటను జూడుమీ యిదిగో నీ వీ బాలకున్
బ్రోచితే, ఘనమా క్రొవ్విన పుంజు పంది యొకటింకన్ గొఱ్ఱె
పోతిచ్చి నీ, కను సంబ్రమ్ములు చేతుమంచు బలుమ్రొక్కుల్
బొమ్మకుంజేయు మూ, ర్ఖ నరశ్రేణుల జూచినన్ బొడము దుఃఖం
యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

మా మొర వినుము, మమ్ము నీ కంట కనిపెట్టి చూడుము, ఈ బిడ్డను రక్షించితివా నీకు పెద్ద పుంజునుగాని పందినిగాని గొర్రెపోతునుగాని బలియిచ్చి ఉత్సవము చేయుదుము అని ప్రాణములేనిబొమ్మకు మూర్ఖులయిన మనుష్యులు మ్రొక్కుకొనుట చూడగా జాలిపుట్టుకొని వచ్చుచున్నది । యేసుక్రీస్తు ॥

### మనోవేగమునుగురించి

మ॥ 80. క్రియకున్ వేగిరమౌను వాక్యములు వాగ్వేగంబు
కన్నన్ మనో, దయ భావంబులు చాల వేగమగు తద్భావం
బులన్ బాడబా, శ్రయముం గుంచముచేసి గొల్చినను దీరం
బోవు ఈ నామనం, బయయో నీ దయ రాకనేకమవదయ్యా
యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

క్రియచేయుటకంటె మాట వేగిరముగా పలుకబడును; మాటలకంటె మనస్సులో తలంపులు మరీ వేగముగా పుట్టును; ఆ తలంపులను సముద్రమును కొల కుంచముగాపెట్టి కొలిచినను కొలతకు మించిపోవును; ఇట్టి నామనస్సు నీ కృపలేకపోతే స్థిరపడి యేకము కానేరదు । యేసుక్రీస్తు ॥

81. శరవేగంబుకు వాయువేగమునకున్ స్వాంతంబు
నత్యంత వే, గిరమౌ దీనిని బట్టి నిల్పుటకు నంగీకారమున్ సేయ
ని, ద్ధరలోనే మనుజుండు జాలునె భవత్కారుణ్య సారామృతా,
కర కాసార తటీలతల్ దొరకలేకన్ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

బాణమువేగముకంటెను వాయువేగముకంటెను మనోవేగము బహు అధికముగా నుండును; ఇట్టి మనస్సును ఒక్కదానిమీదనే నిల్పుట కెవరికిని సాధ్యముకాదు. నీ కృప యను అమృతముతో నిండిన సరస్సు దరిని ప్రాకు తీగెలు నా చేతికి చిక్కితేనే యిది సాధ్యమగును । యేసుక్రీస్తు ॥

## భక్తులు ఏలాంటివారు

82. సారంబౌ కదళీవనాంతర ఫల శ్రద్ధాశనా సక్తమౌ,
కీరంబుల్ వెసిరేలపండ్లుదిన నంగీకారముల్ సేయునే, నీ రమ్యం
బగు ప్రేమ నామరుచి తేనెల్ గ్రోలు సత్క్రైస్తవుల్, క్రూరా
చారపు వేల్పులన్వేదుక బోరే యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

సారముగల అరటితోటలోని ఫలమును తినమరిగిన చిలుకలు రేల కాయలు తినబోవునా? ప్రేమపూర్ణుడవగు నీ దివ్యమయిన నామామృతము రుచి యనుభవించిన సత్క్రైస్తవులు క్రూరకార్యములుచేసిన ఆయా దేవతల నాశ్రయింపబోరు । యేసుక్రీస్తు ॥

83. భావాంతర్ముఖులైన క్రైస్తవులు సద్భక్తిఁ భవత్పాద
రా, జీవంబుల్ తమ జీవనంబులని సంసేవించి యానంద పా,
రావారాంతర మగ్నులై సుఖము లారఁ మోక్ష సామ్రాజ్య
ముం, జూపన్ నేర్తురు నీ కృపాగరిమనుంచో యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

హృదయపూర్వకమయిన భక్తిగల క్రైస్తవులు నీ పాద పద్మములే తమ భక్తి జీవనమున కాధారములుగా చేసికొని నీ కృపాతిశయముచేత ఆనందసముద్రములో మునిగి యాత్మీయసుఖము ననుభవించుచు మోక్షపదవిభాగ్యము సమృద్ధిగా జూడగలవారైయుందురు । యేసుక్రీస్తు ॥

84. కులగోత్రంబులు వీడనేమి పరుషోక్తుల్ మానగానేమి
యా, శలు తెగగోయ్యనేమి దుర్విషయముల్ చాలించగా
నేమి ని, శ్చల విశ్వాస భవత్పదార్పిత మనస్సంధానముల్ లేని
క్రీస్తులు పేరేగద క్రీస్తులన్న ఫలమేదో యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

గొప్ప కులములను గోత్రములను విడిచిపెట్టిననేమి? కఠినోక్తులు పలుకుట మానితేనేమి! దురాశలు కోసివేసిననేమి! దురనుభవముల విసర్జించిననేమి? స్థిరమయిన విశ్వాసముతో నీకు తమ హృదయములను సమర్పించుకొనని క్రైస్తవులు పేరుకుమాత్రమే క్రైస్తవులుగాని అంతకంటె అధికము లేనేలేదు । యేసుక్రీస్తు ॥

85. మనసే భక్తికి మూలమంచు తమ సన్మార్గంబులన్నమ్మి
నీ, కనికారం బెద నూనలేక యశకాంక్షన్ సత్క్రియల్ చేసి
నూ, తన జన్మంబెదలేని క్రైస్తవులు తథ్యంబెన్నగా మోక్ష రా,
జ్య నివాసంబున జేర సంశయములయ్యా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

భక్తియనేది మనస్సులోనుండునది గనుక తమ మంచితనమును నమ్ముకొని నీ కనికరమును నమ్ముకొనక పేరుకోసమని పుణ్యకార్యములు చేయుచు

తిరిగి పుట్టుటయనే అనుభవములేని క్రైస్తవులు నిజమున కాలోచించిచూడగా పరలోకరాజ్యములో ప్రవేశింతురన్నమాట సందేహాస్పదమే। యేసుక్రీస్తు॥

శా॥ 86. శాకాలన్నములేక నాకలిని దీర్చం జాలునే సత్క్రియా
నీకం బాకరణిఁ మనోదురిత వహ్నిజ్వాల లెట్లార్చున, స్తోకం
బైన భవత్కటాక్ష రసముం జుర్రంగ లేకున్న స, త్పాకంబుం
దెలలేని తెడ్డుగతి వ్యర్థం యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

అన్నములేకుండా కూరలవల్ల కడుపునిండునా? అదేవిధముగ సత్క్రియ లెన్ని యున్నను మనస్సులోని పాపాగ్నిజ్వాలలు చల్లార్చ నేరవు; వంటలో విని యోగించే గరిటెకు ఆ వంటయొక్క రుచి అనుభవములేనట్లు నిండైన నీ కృపామృతము ననుభవించనివాని పుణ్యకార్యములు వ్యర్థమే। యేసుక్రీస్తు॥

### మనుష్యులకు భయపడకుండుట

శా॥ 87. మానుష్యాల్ నను వాని మోముగనగా మా కిష్ట
మున్ లేదు పో, పోనిమ్మంచు దిరస్కరించుటలు నీవు న్వింటివే
త్వత్పదా, ధీనుండ న్నమ చిత్తవృత్తిగను నీ దృగ్దలిప్తియుం
గల్గనా, కూనంబేమిటి లేదు భీతి నరులందో యేసుక్రీస్తుప్రభో.

### తాత్పర్యము

వాని ముఖముచూడ మా కిష్టములేదు, వాని పోనియ్యండని మనుష్యులు నన్ను అసహ్యించుకొనుట నీవును వింటివిగదా; నేను నీ పాదము పట్టిన వాడను; నీ కనుచూపు నా మీదపెట్టి నా మనస్సును నీవు నడిపించుచున్నంత వరకు నాకేమి కొదువలేదు; మనుష్యులకు నేను భయపడేదిలేదు। యేసుక్రీస్తు॥

మ॥ 88. తలలాడించుచు వెక్కిరించుచు మహా దర్పోక్తులుం
బల్కు చే, తుల దాటించుచు దంతము ల్గొరుకుచుం దూషించి
మర్త్యాళి నా, ఖల చారిత్రము లెంచు వేళ వినరాకం జూడక

న్నీవు వా, రలతో వేరొక భంగి నుంటదగునయ్యా యేసుక్రీస్తు
ప్రభో.

### తాత్పర్యము

కొందరు నన్నుచూచి తలలూచుచు వెక్కిరించుచున్నారు, కొందరు బహు నిర్దయగల మాటలు పలుకుచున్నారు, చప్పట్లుకొట్టి పండ్లుకొరుకుచున్నారు; కొందరు తిట్టుచున్నారు; కొందరు నా దుర్మార్గకార్యములను వివరించుచున్నారు. ఇదియంతా నీవు వినకను చూడకయున్నట్టు ఉంటూన్నావు. ఇది నీకుతగునా? । యేసుక్రీస్తు ॥

మ॥ 89. విడిచెం దేవుడు వీని నిప్పుడు మనోవిజ్ఞానముం బోయి
పి, రడియయ్యెం జెడె నింకనేమిటని మర్త్యశ్రేణి యొండొం
డుతో, నుడువన్ సాగెడువేళ తజ్జనులకు న్నోర్మూయ నన్బట్టి
నీ, యడుగుల్ ప్రాపుగ నిచ్చినావు దయనయ్యా యేసుక్రీస్తు
ప్రభో.

### తాత్పర్యము

దేవుడు వీని విడిచిపెట్టియున్నాడు, ఇప్పుడు వీనికి తెలివితేటలు పోయి పిచ్చిపట్టియున్నది, వీడు చెడిపోయినాడని జనులు ఒకరితో నొకరు చెప్పుకొనుచుండగా వారి నోరుమూయవలెనని నన్ను నీవు చేపట్టి దయచూపి నీ పాదములు నా కాశ్రయముగా నిచ్చియున్నావు । యేసుక్రీస్తు ॥

### నిత్యానిత్య వస్తువివేకము

మ॥ 90. తనలోనున్న వివేక మొంచి తనువుం దాగాక నున్నట్లు
రెం, టిని వేర్వేరుగ జూచువానికిగదా డెందంబు చందంబు ద,
న్ననసాంతర్గత పాపవర్తనము గా నవ్వచ్చు నా వెన్క ని, ల్చును
జ్ఞానం బటమీాద ముక్తి పథి గాంచున్ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

మనుష్యుడు తనలోనున్న జ్ఞానము కనిపెట్టి తాన నేవస్తువు తన శరీరము కాదనియు, రెండును వేర్వేరుగా నున్నవనియు గ్రహించినప్పుడే తన హృదయ మెట్టిదో, తన మనస్సులో పుట్టిన పాపప్రవర్తన యెట్టిదో తెలిసికొనగలడు. అప్పుడే అతనికి జ్ఞానము ఉదయించును; అమీద రక్షణమార్గము అతడు గ్రహించగలడు। యేసుక్రీస్తు॥

మ॥ 91. ఇది నా సొమ్మిది నా పొలంబు సరిహద్దీ భూమి నాదిందు గో, ష్పదమంత్రైనను గుడ్డిగవ్వయిన నివ్వంజాలనే నేరికం, చు దురాశంబడి జచ్చువేళను మనుష్యుం డక్కటా సర్వమున్, వదులున్ ఎక్కడి దక్కడే నిలుచు దేవా యేసుక్రీస్తు ప్రభో.

## తాత్పర్యము

ఇది నా సొమ్ము, ఇది నా పొలము. ఇది దాని సరిహద్దు, ఈ భూమి నాది, ఎవ్వరికి ఒక బెత్తెడు భూమినైయెన నియ్యను, గుడ్డిగవ్వయిన నియ్యను, అంటూ దురాశచేత పీడింపబడును; కాని మరణము వచ్చినప్పుడు అయ్యో తన యాస్తి యాపత్తు ఎక్కడిదక్కడే పారవేసిపోవును। యేసుక్రీస్తు॥

మ॥ 92. జననీ గర్భతలంబునుంచి నరుడుం జన్మించు నిర్వస్త్రుడై, వెనుకం గొన్ని దినంబులుండి చనిపోయేవేళ నిర్వస్త్రుడై, చనుచున్నాడిది యేమి చోద్యమిలలో సంపాద్యమేదైన వెం, టను బోదామెను గాలిమూటలివి చూడన్ యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

మనుష్యుడు తల్లికడుపునుండి వచ్చినప్పుడు వస్త్రము లేకుండానే వచ్చును, కొన్ని దినములు లోకములో జీవించినమీదట చనిపోవునప్పుడు వస్త్రము లేకుండానే వెళ్లిపోవుచున్నాడు! ఇది యేమి వింత! భూలోకములో సంపాదించిన ఆస్తి యేదియు వెంటబోదుగదా; ఇదియంతా గాలిమూటలవంటివే గదా। యేసుక్రీస్తు॥

మ॥ 93. కలుముల్లేములు జచ్చు నావలను లెక్కన్ రావు
రోగాంగు డెం, గిలి భక్షించెడి బీద లాజరుడు ముక్తిప్రాప్తుడై
మించె ని, చ్చల భోగించు ధనాఢ్యుడున్నరక శిక్షాపాత్రుడ
య్యెన్ సుఖం, బులు దుఃఖంబులు నెల్లవారికిని తావుల్ యేసు
క్రీస్తుప్రభో.

## తాత్పర్యము

ధనము, దారిద్ర్యము చచ్చినమీదట మానవునికి లెక్కలోకి రావు, లాజరను దరిద్రుడు రోగముతో పుచ్చినవాడై ధనవంతుని యింటి యెంగిలి అన్నము తిని బ్రతికినవాడయినను చచ్చిపోయినప్పుడు పరలోకమునకు బోయెను. ఆ శరీరసుఖమనుభవించిన ధనవంతుడు నరకశిక్ష పొందెను. సుఖ దుఃఖములందరికిని ప్రాప్తించునుగదా। యేసుక్రీస్తు॥

శా॥ 94. కోటిన్ కోటి గుణించునంత ధనమున్ కోశంబులై
యున్న పల్, పోటాక్కింతయు మాన్పజాలునె మనోమోదం
బులందిచ్చునే, తేటా నీ కృపగల్గు భక్తుడు దరిద్రుండైన
హృత్కామఘ్నుం, ఝూటా యత్నుడుగాక నెమ్మిగొను ప్రజ్ఞ
యేసుక్రీస్తుప్రభో.

## తాత్పర్యము

కోటి పెట్టి కోటిని గుణించగా వచ్చినంత ధనము ఒకడు కొట్టులో పోసికొనియున్నను వానికి ఆ ధనమున్నందున పంటినొప్పి యేమాత్రము తగ్గిపోదుగదా; మనస్సుకు ఆనందము కలుగదుగదా. నిర్మలమయిన నీ కృప నను భవించుచున్న భక్తుడెంత పేదవాడైనను ఆశయనే తుపానుచేత కదిలించబడని మనస్సుగలవాడయి జ్ఞానముచేత మనస్సంతుష్టి ననుభవించును। యేసుక్రీస్తు॥

మ॥ 95. దగ లావై యొకరుండు యెండబడి వంతంబోవుచో
ముందటన్, మృగతృష్ణలని నీరమాసను వెసం బోయచ్చటం
బ్రాణముల్, దెగుభంగిం ధనలోభులిండ్ల కడకుం దీనుల్

ధనాపేక్షచే, మిగులం బోవుటలెల్ల నిష్ఫలము లుర్విన్ యేసు క్రీస్తు ప్రభో.

తాత్పర్యము

దాహ మెక్కువయి యెండను బడి ప్రయాణము చేయు మనుష్యుడు ఎదుట ఎండమావులు చూచి నీరు అన్న భ్రమచేత వేగముగాపోయి ప్రాణము విడిచినరీతిగా బీదలు డబ్బు దొరుకునను ఆశతో ధనవంతుల యిండ్లకు బోవుట వ్యర్థమేగదా। యేసుక్రీస్తు॥

అంత్యదినమును గురించి

96. లోకాంత్యంబున న్యాయతీర్పు దినమున్ రూఢంబుగా వచ్చెనన్, బాకానాదము సేయు దూత ధ్వనిచేక్ష్మాకంపమై సర్వమ, ర్త్యాకారంబులు లేచు నక్షయములై యత్యంత శీఘ్రంబులో, నా కాలంపు భయంబు చెప్పదరమయ్యా యేసుక్రీస్తు ప్రభో.

తాత్పర్యము

లోకాంతము వచ్చినప్పుడు న్యాయతీర్పుదినము నిశ్చయముగా వచ్చినదని దేవదూత బాకాధ్వని చేయగా భూమి వణికి నరులందరు అక్షయ శరీరములు తాల్చి క్షణకాలములో సజీవులుగా లేతురు. ఆ సమయమున మానవులకు కలుగు భయమింతయని చెప్ప శక్యముకాదు। యేసుక్రీస్తు॥

97. ప్రళయార్కుండిదె వచ్చెనో యనుచు దుష్పాపుల్ భయం బందగా, కళలెల్లంగొను చంద్రుడో యనుచు భక్త శ్రేణి మోదింపగా, తళుకుల్ దేరెడి నీ మొగంబు జగదంతంబందు గన్పట్టనౌ, భళియంచు న్వినుతింతునే నపుడు దేవా యేసుక్రీస్తుప్రభో.

తాత్పర్యము

ఆ సమయమున మహిమతో నీ ముఖము ప్రకాశించుట చూచి ప్రళయకాలపు సూర్యుడిదిగో వచ్చుచున్నాడని పాపాత్ములు భయముతో నిండు

కొందురు. చల్లని కళలతో ప్రకాశించుచున్న పూర్ణచంద్రుడిదిగో వచ్చు చున్నాడని నీ భక్తులు ఆనందింతురు; అప్పుడు నేను భళీయని సంతోషముతో నిన్ను స్తుతించుదును। యేసుక్రీస్తు॥

శా॥ 98. పాపుల్ నారకభూరి దుఃఖములకుం బాల్పొందగా
భక్తులుం, గాపాడంబడి మోక్షరాజ్య చిర సౌఖ్యంబందగా
న్యాయమి, తీర్పుల్ తీరిచి పాపమృత్యువుల దుర్వ్యాపారము
న్మాన్పి నీ, వాపై శాశ్వతరాజు వౌదువుగదయ్యా యేసుక్రీస్తు
ప్రభో.

తాత్పర్యము

పాపాత్ములు నరకమున అత్యంత దుఃఖము లనుభవించునట్లును, దైవభక్తులు పరలోకమున నిత్యానందము పొందునట్లును, న్యాయతీర్పు రెండు పక్షముల వారికి తీర్చి, యీ లోకములో పాపము మరణములేకుండా నశింపజేసి ఆ మీదట నిరంతరము ప్రభువుగా రాజ్యమేలుదువు గదా। యేసుక్రీస్తు॥

శా॥ 99. నీరంధ్రాంధత మిశ్రగంధకయు తాగ్ని జ్వాలకల్లో
లమూ, లా రావంబును దుఃఖ ధూమ్రపటు ధూమాత్యుగ్ర
పైశాచకా, ఘోరాంతర్గృహమైన నారక సముద్రంబందు నన్ముం
చక, కారుణ్యంబున నా కొసంగితివి మోక్షమ్ యేసుక్రీస్తు
ప్రభో.

తాత్పర్యము

దట్టమయిన అంధకారముతోను గంధకపు మంటలతోను అల్లకల్లోల ధ్వనులతోను దుఃఖముతోను పొగలతోను, నిండి భయంకరులయిన పిశాచములకు నివాసముగానుండు ఘోర నరకసముద్రములో నన్ను ముంచివేయక నామీద దయచూపి నాకు ముక్తి అనుగ్రహించితివి। యేసుక్రీస్తు॥

ప్రభునామ విజయము

మ॥ 100. జగమంతంబయి పోయినన్నలినమై చంద్రార్క తా
రాళితో, గగనంబుం దెగిపోయినం జలధి యింకం బారినం

భూమితో, నగముల్గూలిన సర్వముంజెడిన నీ నామంబు నిల్చుఁ నవీ, న గతిఁ శాశ్వత వైభవోన్నతుల నయ్యా యేసు క్రీస్తు ప్రభో.

తాత్పర్యము

ఈ జగత్తంతయు నశించినను, సూర్యచంద్రులు నక్షత్రరాశియంతయు కాంతులు చెడి ఆకాశమండలము తెగిపోయినను, మహా సముద్రముల జలము లన్ని యింకి ఆరిపోయినను, ఈ భూమిమీద పర్వతములన్ని పడిపోయినను సర్వము శూన్యమైపోయినను, నీనామ ప్రభావము సదాకాలము ఏకరీతిగా కీర్తి మహిమలతో ప్రకాశించుచుండును। యేసుక్రీస్తు ॥

---

క॥ కరుణా నిధియగు క్రీస్తుని
చరణంబులు శరణు గొనుచు సన్మతితోనే
నరులీ శతకము జదివిన
నిరతంబా ప్రభువొసంగు నిజమగు సుఖముల్॥

తాత్పర్యము

కృపాసముద్రుడగు యేసు భగవానుని పాదముల నాశ్రయించినవారు మంచి మనస్సుతో ఈ శతకము చదివితే వారికా ప్రభువు శాశ్వతమయిన సుఖము ననుగ్రహించును ॥

క॥ పదునెనిమిది నూరులు నలు
వది మొదవ వత్సరంపు ప్రభు శకమున సొం
పొదవెడు సెప్టెంబరు నెల
నిది రచితంబయ్యె క్రీస్తు యేసుని కరుణన్॥

## తాత్పర్యము

ఈ శతకము 1845-వ సంవత్సరము సెప్టెంబరు నెలలో యేసుక్రీస్తు కృపచేత రచియింపబడెను.

క॥ క్రమముగ చౌధరి పురుషో
త్తమ దాసునిచేత కల్పితంబగు దీనిఁ
సుమతిం జదివిన వారికి
ప్రముద మొసగు యేసుక్రీస్తు ప్రభు శతకమిలఁ॥

## తాత్పర్యము

చౌధరి పురుషోత్తమ దాసుడు వ్రాసిన యీ శతకమును భక్తితో చదివే వారికి నిజమయిన సంతోషము లభించును.

# పంచ చామర పన్నములు

1. కరంబు లెత్తి మౌళివంచి కన్నుదోయి మూసి నీ
వరాంఘ్రు లాత్మలో దలంచి వందనంబు లెక్కుడా
చరింతు నన్ను గావుమయ్య సత్కృపాంత రంగివై
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

చేతులెత్తి తలవంచి రెండు కన్నులు మూసికొని నీ దివ్యమయిన పాదములు మనస్సులో తలచుకొని విస్తారమయిన స్తోత్రము లర్పింతును; నా మీద కృపగలవాడవై నన్ను రక్షించుమయ్య నరావతారము ధరించిన యేసు నాథ, దీనులను రక్షించువాడా ॥

2. దురంత దుష్కృతాంధకార దుఃఖవార్ధి మగ్నులై
మరేమి దిక్కులేని దీన మానవాళినెల్ల ను
ద్ధరింప దేవునాజ్ఞ బూని ధాత్రి నవతరించితో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నాశనకరమైన పాపమనే అంధకారమునందును దుఃఖసముద్రము నందును మునిగిపోయి, యే దిక్కులేకయున్న దీన మానవకోటిని లేవదీయు మని దేవుని యాజ్ఞ పొందినవాడవై భూలోకమునకు వస్తివి । నరావతార ॥

3. నిరంతరాంతరంగ భక్తి నిష్ఠ నా కొసంగి నం
గరంబునేర్పి యా పిశాచి గర్వ మూడగొట్టి నీ
దరిన్ దిరంబుగా మదాత్మ దాఁచి బ్రోచుమో ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

ఎడతెగని మానసిక భక్తి స్థిరచిత్తము నాకిచ్చి పాపముతో పోరాడ నేర్పి ఆ సాతాను గర్వమును అణగగొట్టి నీ దగ్గర నా యాత్మను స్థిరముగా దాచియుంచి రక్షించుము ప్రభువా। నరావతార ॥

4. దురాశ పాశబద్ధుడైన దుర్నరుండ పాప సా
గరంబులోన మున్గి యొడ్డు గానలేని నన్ను స
త్వరంబుగా భవద్దయా తరిన్ భరించి బ్రోవవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

దుష్టమయిన ఆశలనే త్రాళ్లతో కట్టబడిన దుష్టమానవుడను, పాప సముద్రములో మునిగి ఒడ్డు గానలేకయున్న నన్ను నీవు త్వరగావచ్చి నీ దయ యను నావమీద ఎక్కించి రక్షించుము। నరావతార ॥

5. బిరాన నా మొరాలకించు బీద దాసిగానిపై
పరే పరాకు చిత్తగించి జాగు సేయ నీ కృపా
తరంగ వాక్సుధాబ్ధి ముంచి తాపమార్పిగావవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

శీఘ్రముగా నా విన్నపము వినుము, నీ దీనదాసుని మరచిపోయి ఆలస్యము చేయుట నీకు న్యాయమా? నీ కృప యను తరంగములుగల వాక్కులనే అమృతసముద్రమునందు నన్ను ముంచి నా తాపము చల్లార్చి రక్షించుము। నరావతార ॥

6. పరీక్షజేసి బ్రోతునంటివా మదీయమైన యీ
శరీర మాత్మ లోన బైట సర్వపాపలోపమే
యెరుంగవచ్చుగాని శౌచమేమి గానరాదయా
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నన్ను పరీక్షించి రక్షింతునంటివా నా యొక్క శరీరమును ఆత్మయును పైటను లోపటను పాపముతో కప్పబడియున్నవనియే కనబడును; పరిశుద్ధత యేమాత్రము కనబడదయ్యా । నరావతార ॥

7. కరీంద్ర మంకుశంబుచేతగాక ద్రిప్పగూడునే
తిరంబొకింతలేని నా మతిర్ భవత్కృపా యపాం
గ రజ్జులన్ గుదించి నీవు గట్టకున్న నిల్చునే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

గొప్ప యేనుగును అంకుశముతో పొడవకుండా త్రిప్పవచ్చునా? నిలుకడ యేమాత్రములేని నా మనస్సు నీ కృపగల చూపులనే త్రాళ్లతో బిగించి నీవు కట్టకపోతే స్థిరము కాగలదా । నరావతార ॥

8. భరింపరాని ఘోర పాప భారమెల్ల ద్రుంచి నీ
కురంగటన్ మదాంతరాత్మకుం బ్రశాంత మిమ్ము ని
ష్ఠురంబు గట్టుకొందువేల జూడు నేడు నీదయన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నేను మోయలేని ఘోర పాపభారమునంతను నశింపజేసి నీ సమీపమున నన్నుంచుకొని నా హృదయములో సమాధాన మనుగ్రహించుము. నీవు కఠినుడవని యేల అనిపించుకొందువు? నేడు నన్ను దయతో చూడుము । నరావతార ॥

9. ఎరింగెరుంగరాని రీతి నిట్టు లూరకుండుట
ల్పరే యిదేమి దూరదేశిలాగు నన్ను జూతువీ
దరిద్రు చోట వంత మేల దాపుజేర్చ రాగదే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నన్నెరిగి యెరుగనట్టు చూచి యూరకుండుట నీకు ధర్మమా? నేను పర దేశిని, పరాయివాని నైనట్టు చూచెదవేమి? ఈ పేదవానితో నీకు పంత మెందుకు? నీ దగ్గిరకు చేర్చి రక్షించుటకు రమ్ము । నరావతార ॥

10. చిరాకు బొందితేని యింక జెప్పుకొందు నేరితో
కరుంగదయ్య నీ మనంబు గాలిలోని దీపమై
తిరంబులేని నన్ను బట్టి దిట్ట దీర్చి గావవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నీవు నామీద కోపగించితే మరి యెవరితో చెప్పుకొనగలను? నీ మనసు కరుగదేమి! గాలిలోని దీపమువలె చరించుచున్న నన్ను పట్టి స్థిరపరచి రక్షించుమయ్యా । నరావతార ॥

11. అరణ్య రోదనంబు పోలికయ్యె నస్మదీయ శో
క రావ మాలకించరావు కారణంబదేమొ కో
భరంబు దోఁచెనో క్షమా స్వభావ మెందుడాఁగెనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

వినుట కెవరులేని అరణ్యములో మొరపెట్టుకొను చున్నట్టున్నది నా పని; నా విలాపము వినుటకు రావేలనో? నీకు భారమని తోఁచెనో? క్షమించే నీ స్వభావ మెక్కడదాఁగెనో । నరావతార ॥

12. నిరాశ యెన్నఁడైన గల్గనేరదయ్య నీవు నన్
గురించి తొల్లి యెత్తి పెంచుకొన్న ప్రేమ జూచినన్
దిరంబు నిబ్బరంబు నాకు దిట్టమై గనంబడున్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నీవు నన్ను మొదట ఎత్తుకొని పెంచుటయందు చూపిన ప్రేమ తలంచు కుంటే నిరాశ యెన్నడు పుట్టనేరదు; స్థిరమయిన విశ్వాసము మనస్సులో ధైర్యము చిక్కుచున్నది। నరావతార ॥

13. సిరుల్మెరుంగు దీగెలట్లు శీఘ్రకాలముం జనున్
శరీర మంబు బుద్బుదంబు చంద మందముం జెడున్
తిరంబుగాని మర్త్యుడేల తీవ్రలోభ మణ్చడో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

ధనము మెరుపులవలె క్షణములో కనబడకపోవును; మానవ శరీర సౌందర్యము నీటిబుడ్డవలె త్వరలో మాయమైపోవును; ఇట్టి అస్థిరుడైన మనుష్యుడు ధనాశ యేల అణచుకొనడో గదా। నరావతార॥

14. నిరాపరాధివైన నిన్ను నిర్దయాత్ము లక్కటా
విరోధి యూద సైనికుల్ భవిష్యదుక్తు లొప్పగా
మెరూసలేము బైట చాల హింసబెట్టి చంపిరో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

అయ్యో! దోషరహితుడవయిన నిన్ను క్రూరులయిన యూదులును రాణువవారును యెరూషలేమునకు బయటి ప్రదేశములో బహుగా హింస పెట్టి చంపిరి; ఇందువల్ల ప్రవక్తలు చెప్పినది నెరవేరును। నరావతార ॥

15. అరాతులయినవారు నిన్నులక్ష్యపెట్టి గొట్టుట
ల్పరే యెరింగెరింగి ప్రేమ సల్పు నేను నీకు ము
ష్కరుండనై రహస్య బాధ చాలబెట్టి నానయో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నీ విరోధులు నిన్ను నిర్లక్ష్యముచేసి కొట్టిరంటె అది యొక వింతకాదు. నిన్ను ప్రేమించిన నేనయితే బుద్ధిపూర్వకముగా మూర్ఖబుద్ధితో నీకు చాలా బాధ లోలోపల కలుగజేసితినిగదా। నరావతార ॥

16. కరుంగదేమి సేతు నెంత గట్టి గుండె నాదకో
ఘరీతియైన పాపవహ్ని కొంగుమూట గట్టినా
శిరంబు కెత్తుకోను చింతచేసి నాడ నయ్యయో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నా హృదయమెంతో కఠినమయినది, యెంతకు కరుగదు, నేనేమి చేతును; బహు ఘోరమయిన పాపమనే అగ్నిని బట్ట చెంగున కట్టుకొని నెత్తి మీద పెట్టుకొన్నట్టు నడిచితిని అయ్యయ్యో। నరావతార ॥

17. మరింత బాధపైని బాధ మానబారు పుంటిపై
కరాసి దూసిపోవునట్లుగా మదీయ పూర్వ దు
స్తరాపదాబ్ధి యొడ్డుజేర దావవహ్ని జుట్టెనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నొప్పిమీద నొప్పివచ్చినట్టు నా స్థితి యున్నది, మానుతున్న పుండు మీద పదునయిన కత్తి దూసుకొనిపోయినట్టున్నది; మొదట నాకు కలిగిన సహింప శక్యముగాని దుఃఖ సముద్రము దాటి యొడ్డు కెక్కగానే కారు చిచ్చుమంటలు నా చుట్టు రగులుకొని నట్టున్నాను। నరావతార ॥

18. నిరూఢ సత్యవేదసార నీతి దివ్య వాక్య మా
ధురీ రసంబు గ్రోలు జిహ్వతోను జెప్పుదున్ సరే
దురుక్తులాడి యిట్టి పెక్కు దుఃఖ మిస్తి వందునో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

స్థిరమయిన నీ వేదవాక్యములోని నీతి వచనముల నే మధురరసము నొక్కప్పుడు పానముచేసిన నా నాలుకతో—ఆడరాని మాటలాడి యిట్టి దుఃఖము నాకు తెచ్చిపెట్టితివిగదా యని యందును । నరావతార ॥

19. శరీరవేష భాష లింక చాలు చాలు వీడు మం
తరింద్రియంబ నీవు యేసు తత్వబోధ గాంచి క్రీ
స్తు రూపులోన బూని బుద్ధి శుద్ధినుండు మందునో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

బయటి వేషములు మాటలు ఇంతటితో చాలును; ఓ నా మనసా, వాటిని విడిచిపెట్టి యేసు నేర్పిన ఆత్మీయబోధ ననుసరించి ఆయన స్వరూపము ఆత్మయందు ధరించి పవిత్రమైన మనస్సుకలిగియుండుము । నరావతార ॥

20. తిరంబుగా యెహోవ కన్ను దిక్కు కన్ను లుంచక
పొరల్ ధరించి పోతరించి బుద్ధిమాలి యొక్క మం
టి రూపు నాసచేసి నే గణించినాడ పాపమో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

నా కన్నులను దేవుని దృష్టివయిపు నిశ్చలముగా నుంచుకొనక పొరలు కమ్మి మదించి బుద్ధిపోయి ఒక మంటిస్వరూపముమీద ఆశపడి నేను పాపము మూటకట్టుకొంటినే । నరావతార ॥

21. నిరంతరంబు నా మొగంబు నేలతట్టువంచి నా
కరంబుచేత రొమ్ముగొట్టి కంట నీరు జారగా
నిరుత్తరుండనై యొకప్పు నేరమెంచుకొందునో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

సిగ్గుతో ఎల్లప్పుడు నా తలను నేలవైపు వంచుకొని చేతితో రొమ్ము కొట్టుకొనుచు కన్నులవెంట నీరు కారుచుండగా నా పాపమునకు ఉత్తర మేమియు చెప్పుకొనను, దానిని ఒప్పుకొందును । నరావతార ॥

22. సరాళ మార్గమందు చిత్తశాంతి నేగి యేగి య
ద్దరిం బిరాలనొక్క పొల్లుదారి గాంచి పోవుము
ష్కరుండువోలె నేను చెడ్డ జాడ గూడ బోతినో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

సరియైన మంచిదారిని నెమ్మదిగా పోయి పోయి యొకచోట తప్పుదారి యొకటిచూచి వేగముగా ఆ దారిబట్టి పోవు మూర్ఖునివలె పాపమార్గమున బడి పోతినయ్యా । నరావతార ॥

23. హరించు పాపమెల్ల నీ మహా పవిత్ర రక్తబిం
దు రాశిలోన నొక్క చుక్కతోగదా యిదేమదిన్
నిరంతరంబు నమ్మినాడ నీవె సాక్షివిందుకో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

నీ మహా పవిత్రమయిన రక్తములో నొక్కచుక్కతో నా పాపమంతా హరించిపోవుననే మాట నా మనస్సులో ఎల్లప్పుడు నమ్ముకొనియున్నాను; ఇందుకు నీవేసాక్షివి । నరావతార ॥

24. ధరిత్రిలోన మృత్యు దేహ ధారి జూచునంచెదన్
కరంబు భీతిగల్గు పాప కర్మమందు నీవు చూ
డరాని కార్యమేది నీ యెడన్ అలక్ష్యమేలకో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

ఈ లోకములో మరణమునకు లోనైన దేహముగల మానవుడు చూచుచున్నాడంటే పాపకార్యము చేయుటకు మనస్సులో భయముకలుగును; నీకు కనబడని కార్యము లేదుగదా! నీ యెడల నిర్లక్ష్యమెందుకో । నరావతార ॥

25. పరేశుడైన తండ్రియొద్ద భక్తిలేని ద్రోహినై
చరించినాడ నంతరంగ సాక్షికిన్విరోధ మా
చరించినాడ నింక నీకు చాల దుఃఖమిచ్చితో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

పరమునకు ప్రభువగు తండ్రియెదుట భక్తిలేని పరమద్రోహినై ప్రవర్తించితిని; నా మనస్సాక్షికి విరోధముగా నడుచుకొంటిని; నీకు ఎంతో దుఃఖము కలుగజేసితిని । నరావతార ॥

26. విరక్తిబొందకయ్య నా వివేక హీనకార్యముల్
పొరింబొరిం దలంచకయ్య బుద్ధిశుద్ధిలేని దు
ర్నరుండటంచు నన్ను వీడనాడకయ్య మ్రొక్కెదన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

నామీద అసహ్యపడకు స్వామీ, నా అవివేకపు చేష్టలు మళ్లీమళ్లీ జ్ఞాపకము చేసికొనవద్దు; పరిశుద్ధమైన మనస్సులేని దుర్మార్గుడను నన్ను విడిచిపెట్టకుము; నీకు మ్రొక్కెదను । నరావతార ॥

27. భరింపరాని దుఃఖరాసి పాలు ముందుపొందుటల్
మెరింగెరింగి యింక నా దురిచ్ఛ కేగవచ్చునే
పరాకు నా కిదేమి యెంత పాపజన్మినయ్యయో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

సహింపరాని దుఃఖములు ముందుకు ప్రాప్తింపుమనని యెరిగియుండియు ఇకను నా చెడుకోరికల ప్రకారము నడుచుకొనవచ్చునా! నాకీ అజ్ఞానమేల నేనెంత పాపస్వభావముగలవాడను! । నరావతార ॥

28. నరుండ మంటిలోన బుట్టినాడ నా స్వభావముం
ఎరింగియుంటి వీవు మంటికేది మంచి తెల్వి యీ
దరిద్రు దీను దుర్బలాత్ము తప్పుదిద్ది బ్రోవవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నేను నరమాత్రుడను, మంటితో చేయబడిన శరీరముగలవాడను, నా స్వభావము నీ వెరిగినదే, మంటికి మంచి జ్ఞానమెక్కడవచ్చును! దరిద్రుడను దీనుడను నీరసుడనైన నాలోను తప్పులుదిద్ది రక్షించుము । నరావతార ॥

29. మరల్చి పాపబుద్ధి దుఃఖవార్ధి యింకజేసి యు
ద్ధరించి తొల్లి నన్ను నెత్తి దాపుజేర్చినావు ని
న్నెరుంగుదు న్మదీయ భారమింక నీదెకాదె యో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

ఇంతకుముందు నా పాపస్వభావమును మార్చి దుఃఖసముద్రమెండగట్టి నన్ను రక్షించి లేవనెత్తి నీ దరినిచేర్చితివి; నీ వెట్టివాడవో నేనెరుగుదును. ఇక మీదట నా భారము యావత్తు నీదేగదా । నరావతార ॥

30. తరతరాల నాటి తాత తండ్రులైనవారికే
మెరుంగరాని నీ సువార్త నిచ్చినావు నాకు ధూ
ళి రేణువైన నేను నీదు లెక్కలోకి వచ్చితిన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

తరతరములనాటి నా పూర్వికులు కెంతమాత్రము ఎరుగని సువార్త జ్ఞానము నాకు అనుగ్రహించితివి; దుమ్ము ధూళినిబోలిన నన్ను నీ యెన్నికలోకి తెచ్చి నన్ను రక్షించితివి । నరావతార ॥

31. కరంబుపై కరంబుగొట్టి కన్ను మూయునంతలో
ధరిత్రి మండలంబు మేర దాఁటిపోవు నామదిన్
తిరంబు జేయకున్న నీకు తీరుబాటు నియ్యనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

చేతిమీద చెయ్యివేసి దెబ్బకొట్టినంతలో, రెప్పపాటుకాలములో ఈ భూలోకమంతా తిరిగిరాగల నా మనస్సును నీవు స్థిరముగా చేయువరకు నీకు తీరుబాటుండనియనయ్య ! నరావతార ॥

32. దురంబు చేసిచేసి వీఁగి దొర్లిపడ్డవేళ నా
తెరంగు జూచి నీవదేల తేరకానిలాగు బ్రో
నరాక యూరకున్న నిందువల్ల నిందరాదకో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

పాపము విస్తారముగా చేసి మదించి క్రిందపడినప్పుడు నా యవస్థ చూచి అక్కరపట్టునట్టు నన్ను రక్షింప రాకయున్నావే, యిందువల్ల నిన్ను అందరు నిందించరా? । నరావతార ॥

33. చిరాయు వబ్బి సర్వధాత్రి సీమనేల గల్గినన్
సిరుల్ సమృద్ధినుండి నీదు సేవలేకయున్న దు
స్తరంపు నారకాబ్ధి యొడ్డు దాపునున్నయట్లగున్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

దీర్ఘాయుస్సుకలిగి యీ ప్రపంచమంతటిమీద రాజ్యమేలకలిగి సమృద్ధిగా ధనము సంపాదించినను, నీ సేవచేయు భాగ్యములేకపోతే దాట నశక్యమయిన నరకసముద్రము ఒడ్డుననున్నట్లేగదా । నరావతార ॥

34. గురుప్రబోధ నేను మున్నుగోరి తాడులేని బొం
గరంబు రీతి ద్రిమ్మరైతిగాని వెజ్జువేలు పొ
క్కరుణ్ణినైన పాపహీను గాననైతి నెచ్చటన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

మునుపు నేను గురువులవల్ల ఉపదేశము పొందగోరితిని; దారములేని బొంగరమువలె నిరాధారముగా తిరిగితిని, పాపములేని దేవత నొక్కరినైన ఎచ్చటను చూడలేకపోతిని । నరావతార ॥

35. మరేల జాలమింకసేయ మంచిదా సదా మదం
తరాత్మలోని యంగలార్పుతావు నీవు చూడవా
బిరాన రాగదయ్య వచ్చి పెంచుమయ్య నీ దయన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

ఎందుకింకా ఆలస్యముచేయుదువు? ఇది నీకు ధర్మమా? నా అంగలార్పు లెక్కడనుండి వస్తున్నవో నీకు తెలియదా? వేగముగా వచ్చి దయతో నన్ను రక్షించుమయ్యా । నరావతార ॥

36. ఎరుంగరాదు నీ మహత్వమెంత గ్రుడ్డులోని పి
ల్ల రీతినున్న నన్నుపైకిలాగి కన్నువిప్పి యా
త్మ రక్షణార్థమైన మంచి దారిజూపి నావయా
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

నీ శక్తియెట్టిదో తెలిసికొన సాధ్యముకాదు; గ్రుడ్డులోనున్న కోడిపిల్ల వలె నేనున్నప్పుడు నన్ను బయటికిలాగి కన్నువిప్పి ఆత్మరక్షణదారికే మంచి మార్గము నాకు చూపితివిగదా। నరావతార ॥

37. చరిత్రలెన్ని లేవు వెర్రిశాస్త్ర దైవముల్పరం
వరాభివృద్ధి గావె శుద్ధభక్తి యుక్తి ముక్తి నీ
పరాంఘ్రులిచ్చుగాక వేరె వార్తలన్ని వట్టివో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

ఎన్నెన్నో శాస్త్రములున్నవి, పిచ్చిశాస్త్రములలో దేవతలు లెక్కలేనంత మంది యున్నారుగాని నీ దివ్యమయిన పాదములే పరిశుద్ధమైన భక్తిసాధనము, ముక్తిమార్గము నిచ్చునది; తక్కిన వార్తలన్ని కల్లవార్తలేగదా। నరావతార ॥

38. విరోధినాకు లేడొకండు విశ్వమందు నెందునన్
పరీక్షజేసినాను దుస్స్వభావ మొక్కటే మదాం
తరాత్మలోని దుర్విరోధి దాని ద్రుంచవే ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

ఈ ప్రపంచమునందు ఎంత పరీక్షించి చూచినను నాకు శత్రువు ఒక్కడునులేడు; నా దుష్టస్వభావ మొక్కటే. నా యాత్మలోనున్న బలవ ద్విరోధి; దాని నశింపజేయుమయ్యా। నరావతార ॥

39. గురుండు తల్లితండ్రి యేలుకొన్నరాజు దాతయున్
నిరంతరోపకారి నాకు నీవె కావె యింక న
న్నెరుంగువార లెవ్వరయ్య యిష్టసిద్ధిజేయనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

నీవే నాకు పరమగురువు, తల్లివి, తండ్రివి, నన్నేలురాజవు, సమస్తము నిచ్చు దాతవు, ఎల్లప్పుడు నా కుపకారము చేయువాడవు, నీకంటె నన్నెరిగినవారెవరును లేరు, నా కోరికెలు సఫలముచేయువారును లేరు। నరావతార ॥

40. పరున్నవేళ నాదు పాన్పు పజ్జకేఁగుదెంచిన౯
పరామరించి నీ ప్రతిజ్ఞవాక్యముల్ మదాత్మకు౯
స్మరింపజేసి ధైర్యపర్చి శాంతినిద్ర నిత్తువో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

నేను పక్కమీద పండుకొనియున్నప్పుడు నా పక్కవద్దకు వచ్చి నన్ను పరామర్శచేసి నీ వాగ్దానములు నాకు జ్ఞాపకముచేసి ధైర్యము చెప్పి నెమ్మదయిన నిద్ర యిచ్చుచున్నావు। నరావతార ॥

41. ధరిత్రియెల్ల గూర్చి యొక్కతట్టు నన్నునొక్కచో
తరాజునుంచి తూతువేని ధాత్రి చుల్కనౌను నే
భరంబునౌదు నెందుకన్న పాపినవుటవల్లనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

ఈ భూలోకమంతా పోగుచేసి తరాజులో దాని నొకవైపునను నన్నొక వైపునను పెట్టి తూచితివేని నేను బరువవుదును, భూమి తేలికవును. అది యెందుకనగా నా పాపభారమునుబట్టి నేనే భారమవుదును। నరావతార ॥

42. పురాతన స్వభావ వృక్షమూల మూడదీసి నీ
కరాసిచేత తున్కతున్కగానొనర్చి ప్రేమ వ
హ్నిరాఁజబెట్టి గాల్చివుచ్చి నెమ్మదియ్యవే ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నా పాత పాపస్వభావమనే వృక్షము దాని వేరుతో త్రవ్వి పడగొట్టి నీ పదునైన ఖడ్గముతో నరికి తునకలుచేసి నీ ప్రేమ యను అగ్నిలో కాల్చివేసి నాకు మనశ్శాంతి దయచేయవే। నరావతార॥

43. స్మరించి నా మనంబులోన చర్చసేయనెంత య
బ్బురంబు సిగ్గుగానుపించు ముల్లుదీసి కొయ్య గు
చ్చురీతి నయ్యెగాక నా యశుద్ధబుద్ధి కార్యమో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నా పాపము జ్ఞాపకముచేసికొని నా మనస్సును శోధించినప్పుడు ఎంతో ఆశ్చర్యము సిగ్గు పుట్టుకొని వచ్చును; నా యపవిత్రపు మనస్సు స్థితి ఆలోచించుకొనగా కాలిలోని ముల్లుతీసి కొయ్యమేకు గుచ్చుకొన్నట్లున్నది। నరావతార॥

44. చురుక్కునన్ మనంబులోన చూడినట్లగుం గదా
దురంత పాప వహ్నిచేత తొల్లి కాలియున్న మ
చ్చ రేపినాడనయ్యొ నా విచార మేడబోయెనో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

భరింప శక్యముగాని పాపాగ్నిచేత మొదట కాలియున్న పుండు మచ్చను రేపితిని, అందువల్ల నా మనస్సు కాలినట్లు చురుక్కుమని మండెను; నేను చేసిన పాపమునుగూర్చి పశ్చాత్తాప మేమాయెనో। నరావతార॥

45. పరుండొకండు గోతబడ్డ వాని నెత్తబోయి త
త్తరంబుచేత నూతిలోన దానె బడ్డ రీతి నా
చరిత్రమయ్యె నింక చెప్ప జాలినంత యున్నదో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

ఒక మనుష్యుడు నూతిలో పడుట చూచి యింకొకడు వానిని లేవ నెత్తబోయి తొందరచేత తానే ఆ నూతిలో పడినట్లుగా నా కథయైనది ఇంకా చెప్పవలెనంటే యెంతో యున్నది। నరావతార॥

46. తరింతు పాతకాబ్ధి స్వాంత దండుతో పిశాచి నం
గరంబు సేయవచ్చెనేని గర్వమూడ్తువాని నీ
దరిద్రుపై భవత్కృపా సుధాసుధార బోసినన్
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

ఈ దీనునిమీద నీ కృపయనే అమృతధారలు పోసినయెడల పాప సముద్రము దాటుదును; సాతాను తన దండుతో నాతో యుద్ధముచేయ వచ్చినయెడల వాని గర్వము నణతును। నరావతార॥

47. నిరంజనుండు నిర్వికారి నిర్మలాత్ముడున్ పరా
పరుం డనంత దివ్య శక్తివంతుడైన తండ్రి స్వ
స్వరూపివైన నీవు మానుష స్వరూపమైతివో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

### తాత్పర్యము

నాశనములేనివాడు, మార్పు పొందనివాడు, పరిశుద్ధుడగు ఆత్మస్వరూపి, సర్వమునకు అతీతుడు, అంతములేని శక్తిగలవాడయిన తండ్రి యగు దేవుని యొక్క స్వరూపమయిన నీవు మనుష్యరూపము తాల్చితివి। నరావతార॥

48. నరాధమాధమాళిలోన నాయకుండ నేను నూ
కంబు కుర్కురంబు సాటిగా నొనర్చినాడ నా
దురాత్ము కావు కావు మంచు దోసిలొగ్గితో ప్రభో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నేను మానవులలో అధములలో అధముడను; పందులు కోళ్లు చేయు అపవిత్ర కార్యములను బోలిన అసహ్యమైన పాపకార్యములు చేసినవాడను, ఈ పాపాత్ముని రక్షించుము, రక్షించుమని చేతులు జోడించి వేడుకొను చున్నాను । నరావతార ॥

49. దరిన్ మదాత్మ దాఁచి బ్రోచి ధైర్యమిచ్చితయ్య క
నక్కరించు మింక తక్కయున్న కాలమెల్ల వెల్గులో
చరించునట్ల నన్ను కాలు జారకుండ జేయుమో
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నీ దగ్గర నా యాత్మను దాచిపెట్టి రక్షించి ధైర్యము కలుగజేసితివి; మిగిలిన నా జీవితకాలమంతా నన్ను కనికరించి నీ వెలుగులో నేను సంచరించు లాగున పాపములో కాలుజారి పడకుండా నిలువబెట్టుము । నరావతార ॥

50. స్ఫురద్భవత్కృపా బలంబు పుచ్చుకొంచు నే నిరక్ష
ధరిత్రిలో జరించు జీవితంపు కాలమెల్ల సు
స్థిరంబుగా త్వదీయ సేవ జేయునట్లు సేయవే
నరావతారధారి యేసునాథ దీనరక్షకా.

## తాత్పర్యము

నీ కృపా సహాయము నేను నీ యొద్ద తీసికొనుచు ఇక నేనీ లోకములో బ్రతికే కాలమంతా స్థిరముగా నీ సేవచేయుచు బ్రతుకుటకు కృప దయచేయుము । నరావతార ॥

క॥ మనసానందము క్రైస్తవ
జన యనుభవసార పంచ చామరపన్నం
బనుకూల మతిని జదువు సు
జనులకు ప్రభు క్రీస్తుడాత్మ సౌఖ్యము లిచ్చున్.

## తాత్పర్యము

సత్క్రైస్తవుల యనుభవసారమును తెలియజేసే యీ పంచచామర పన్నమును ఇష్టముతో చదువువారికి యేసుప్రభువు ఆత్మీయమయిన ఆనందమును సకల సౌఖ్యములను దయచేయుగాక!

---

# పంచరత్నములు

అను

# అయిదు సీసపద్యములు

1. ఎవ్వడు తనజేన నిమిడించి కొలుచు-నీ
యాకాశ మండలం బద్భుతముగ,
నెవ్వడీ పుడమి మన్నెల్లను తన కుంచ
మునకు లోబడజేయు ఘనబలమున,
యెవ్వడీ మహిత మహీధరంబుల బట్టి
తన తరాజున నుంచి యొనర దూఁచు,
నెవ్వడీ జలధులం దిముడు నీరములన్ని
తన చేతి పుడిసెలో నునిచి కొలుచు,
తే. గీ. వసుధ గల సర్వ జీవాళి నిసుక కన్న
సన్నముగ జూచి త్రాసులో సరగ నునుచు,
నెవడొ యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవ దిక్కు నా కనుదినంబు.

## తాత్పర్యము

ఏ మహానుభావుడు తన జేనతో ఈ ఆకాశమండలమును ఆశ్చర్యముగా కొలుచునో, ఏ మహానుభావుడు ఈ భూగోళములోనున్న మన్నంతా తన కుంచములో తన బలముచేత పోయగలడో, ఏ మహానుభావుడు ఈ మహా పర్వతముల నన్నిటిని తూనికెరాళ్లుగాజేసి తన తరాజులో పెట్టి తూచునో, ఏ మహానుభావుడు ఈ సముద్రములోని నీళ్లన్ని తన చేతి పుడిసెలో పట్టగలడో, లోకములోనున్న జీవరాసులన్నిటిని ఇసుకరేణువులకంటె

అల్పమైనవిగా నెంచి తన త్రాసులో పెట్టగలడో ఆయన నాకు ప్రియమైన తండ్రియైనవాడు, ఆయన నామము ఘనుడగు యెహోవా, ఆయనే ప్రతి దినము నాకు దిక్కుగా నున్నాడు.

2. ఎవ్వని చేతిలో నీ విశ్వమంతయు
నాటల పూబంతి యట్టులుండు,
నెవ్వని కాంతియం దీసూర్యచంద్రులు
మెరుగుడు పురుగుల ట్లెరుగబడుదు,
రెవ్వని యొడిగట్ట నీ తారలన్నియు
మల్లెమొగ్గలరీతి గిల్లబడును,
యెవ్వని కనుదృష్టి కీ భూమిగోళంబు
పరసావగింజతో సాటిపడును,
తే॥ గీ॥ యెవని మీగాళ్ల బంటి రాఫీయగాధ,
వార్ధి నీరములటువంటి వర బలాఢ్యు,
డెవడో యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవాన దిక్కు నా కనుదినంబు.

## తాత్పర్యము

ఏ ఘనునిచేతిలో ఈ ప్రపంచమంతా పువ్వుల చెండువలె చిన్నదిగా నున్నదో, ఏ ఘనుని స్వరూప ప్రకాశము ఎదుట ఈ సూర్య చంద్రులు మెరుగుడుపురుగులు బోలునో, ఏ ఘనుని ఒడిలో పోయదగిన మల్లెపువ్వుల వలె ఈ నక్షత్రములన్ని కనబడునో, ఏ ఘనుని దృష్టియందు ఈ భూగోళము ఆవగింజంత చిన్నదిగా నుండునో, ఎవని మీగాళ్లయినా ఈ మహాసముద్రముల లోని నీరంతా తడపజాలదో ఆ మహా బలాఢ్యుడైనవాడు నాకు ప్రియుడైన తండ్రి; ఆయన నామము ఘనుడగు యెహోవా, ఆయనే ప్రతిదినము నాకు దిక్కుగా నున్నాడు.

3. పరమండలము వసుంధర మండలము బట్టి
బంతులట్లాడించు ప్రబలుడెవడు,

పగటెండ రేయెండ పాన్పులట్లుగ చుట్ట
బెట్టి వేరొకచోట బెట్టునెవడు,
సర్వ జీవాధార సంచార పవనంబు
లొక ముష్టిలో బట్టు నొడయు డెవడు,
హిమ తపో వర్షకాలముల మూలలనుంచి
యెత్తి యుద్యోగంబు లిచ్చునెవడు;
తనకు దానె సమాన సౌందర్య సర్వ,
శక్తి విజ్ఞాన సత్కృపా శాంతమూర్తి,
యెవడో యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవ దిక్కు నా కనుదినంబు.

## తాత్పర్యము

ఏ బలాఢ్యుడు పరమండలమును భూమండలమును పట్టుకొని బంతుల వలె ఆడించగలడో, ఏ ఘనుడు సూర్యుని చంద్రుని పరుపులవలె చుట్టి అవతల పెట్టివేసినట్టు పెట్టివేయగలడో, ఏ ప్రభువు సకల ప్రాణికోటులకు జీవాధారమయిన వాయువులన్నిటిని తన పిడికిలిలో పట్టి యుంచగలడో, ఏ మహారాజు చలికాలము వేసవికాలము వర్షకాలము అన్నికాలములను అవతల ఉంచి వాటి వాటి కాలములయందు వాటి వాటి పనులు చేయునట్లు నియమించు చున్నాడో, సౌందర్యమునందును సర్వశక్తియందును జ్ఞానమునందును కృపా శాంతములయందును తనను పోలినవాడు మరియొకడు లేక యున్నవాడో ఆ దేవుడే నాకు ప్రియుడైన తండ్రి, ఆయన నామము ఘనుడగు యెహోవా, ఆయనే ప్రతిదినము నాకు దిక్కుగా నున్నాడు.

4. పరమదూతల మోక్షపురము దెవ్వని కంట
పరిశుద్ధముగ చూడ గొరత దోచు,
సత్య ప్రియాధిక సంతోషములమీద
నెవని సింహాసనం బెలమినుండు,

సకల జీవుల భక్ష్య సామగ్రులెల్ల నె
వ్వాని చేతి దానంబులనుదినంబు,
సకలార్థ శబ్ద వాచకములన్నియు గూడి
యెవని పేర్కొనియాడ నెరుగలేవు,
తే॥ గీ॥ ఎవ్వారే కాలమున కంటి కింపుతోడ,
జూడగోరిన తనరూపు జూపకుండు,
నెవడో, యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవ దిక్కునా కనుదినంబు.

## తాత్పర్యము

పరిశుద్ధ దూతలకు నివాసమయిన మోక్షపురము సహా యే పరిశుద్ధుని దృష్టికి లోపము గలదిగా తోచునో, ఏ మహారాజు సింహాసనము సత్యము ప్రేమాతిశయము ఆనందము మొదలగు కల్యాణ గుణములమీద స్థాపింపబడి యుండునో, ఏ ధర్మాత్ముడు సమస్త జీవులకు ప్రతి దినము ఆహారము తన చేతితో పెట్టి పోషించుచున్నాడో, ఎవరి ఘనమయిన నామమును సకల భాషలలోని శబ్దములన్ని కలిపినను ప్రకటన చేయలేవో, ఏ ప్రభువును మానవులు కంటితో చూడవలెనని కోరినను ఆ ప్రభువు స్వరూప దర్శనము దొరక నేరదో, ఆ దేవుడే నాకు ప్రియుడయిన తండ్రి, ఆయన నామము ఘనుడగు యెహోవా, ఆయనే ప్రతిదినము నాకు దిక్కుగా నున్నాడు.

5. అఖిల లోకముల వృత్తాంత మాద్యంతంబు
ఎవ్వని పటమునం దిమిడి యుండు,
సకలాంతరాత్మల సాక్షియై యెవడు కా
రణ కార్యభావనల్ గణనసేయు,

జీవనిర్జీవ సైన్యావళిలో చిన్న
పురువైన తృణమైన మరువ డెవడు,
తగ భవిష్యద్భూత తత్కాలముల నేలు
చొక రీతిగల నీతి నుండు నెవడు,

తే.గీ. తండ్రి తనయుండు విమలాత్మ తానె యగుచు,
నాణెముగ దీన భక్త బృందముల బ్రోచు
నెవడొ యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవ దిక్కునా కనుదినంబు.

## తాత్పర్యము

సమస్త లోకముల వృత్తాంతము ఆదిమధ్యాంతము యావత్తు ఎవని దృష్టికి పటములో వ్రాసియున్నట్టుండునో, ఎవడు యావన్మంది హృదయములలోను ఉండి వాటిలో పుట్టు యోచనలును వాటి ననుసరించి వచ్చు కార్యములును సాక్షీభూతముగా నుంటున్నాడో, సమస్తమైన జీవజంతువులలోను నిర్జీవ పదార్థములలోను చిన్నపురుగైన గడ్డిపరకైన మరచిపోడో, భూత భవిష్యద్వర్తమానకాలములలో జరుగు సర్వమును నీతిపద్ధతిని నడిపించుచుండునో, ఆ దేవుడు తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయను ముగ్గురు మూర్తులుగా నున్నను తానొక్కడే యగుచు, దీనులయిన తన భక్తులను రక్షించుచున్నాడు. ఆ దేవుడే నాకు ప్రియుడైన తండ్రి, ఆయన నామము ఘనుడయిన యెహోవా ఆయనే ప్రతిదినము నాకు దిక్కుగా నున్నాడు.

క॥ వెలలేని పంచచామర
ములు మరియును పంచరత్నములు ప్రభువు కృపన్
ఇల చౌధరి పురుషోత్తము
వలన రచితమయ్యె సాధువర్గంబలరన్॥

## తాత్పర్యము

మహా శ్రేష్ఠమయిన యీ పంచచామర పద్యములును పంచ రత్నములును ప్రభువు కృపచేత సజ్జనులయినివారికి సంతోషము కలుగునట్లు చౌధరి పురుషోత్తము రచియించెను.

క॥ దేవుని యాశీర్వాదము
కేవలుడగు ప్రభువుయేసు క్రీస్తుని కృపయున్
ఆ విమలాత్మ సహాయం
బీవర గ్రంథంబుతోడ నెడపక యుండున్ ॥

## తాత్పర్యము

దేవుని దీవెనయును, ఒక్కడే రక్షకుడగు యేసుక్రీస్తు కృపయును, ఆ పరిశుద్ధాత్మ సహాయమును ఈ పుస్తకముతో ఎల్లప్పుడు నుండుగాక.

మ. రా:—ఈ పద్యములకు అర్థములు 1933 లో పురుషోత్తమ చౌధరిగారు క్రైస్తవులయిన శతవార్షికోత్సవ సందర్భగౌరవార్థమై రెవరెండ్ కేనన్ ధన్నవాడ అనంతం బి.ఏ. గారిచే వ్రాయబడి, యెల్లరి కృతజ్ఞతాపూర్వక అంగీకారమయ్యెను.

పురుషోత్తమ చౌధరిగారు 30 ఏండ్ల ప్రాయమున 1833 సం॥ అక్టోబరు 6-వ తేదిని కటకపురిలో క్రైస్తవమత అవగాహస్నానదీక్ష పొందిరి.